



Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 267 | సోమవారం 06 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

- రెస్క్యూ విమానాన్ని కూల్చేసిన ఇరాన్..ఐదుగురు మృతి
- దిగిరాకుంటే నరకమే : ట్రంప్ అల్టిమేటం
- పట్టించుకోని టెహ్రాన్
- గల్ఫ్‌పై కొనసాగుతున్న దాడులు


**టెహ్రాన్ - సూర్య వాస్తవం**

ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో అమెరికా దళాలకు మరో ఎదురు దెబ్బ తగిలింది. అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేయడం, దానిలో ఉన్న ఇద్దరు పైలట్లలో ఒకరు గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన రెస్క్యూ విమానాన్ని కూడా కూల్చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ప్రకటించారు. పైలట్‌ను రక్షించామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత ఇరాన్ మీడియా ఓ వార్తను అందిం చింది.



## విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

### - అసోం సభలో రాహుల్ గాంధీ విమర్శ



**గౌహతీ - సూర్య వాస్తవం**

ప్రజల మధ్యన విభజన తీసుకొచ్చి రాజకీయ లబ్ది పొందేందుకు బీజేపీ విద్వేషం వ్యాప్తి చేస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో అసోంలోని బిశ్వనాథ్ చరియాలీలో ఆదివారం నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను విద్వేషం విరజిమ్మే నేతగా ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే..


- మిగతా 2లో..

# ఉద్యమంలా నీటి భద్రత

- 100 రోజుల స్పెషల్ డ్రైవ్ కాల్వలు, చెరువులు, చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు
- సాగునీటి సంఘాలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

**అమరావతి - సూర్య వాస్తవం**

రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా నేడు రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే 100 రోజుల ప్రణాళికపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా, సీఎం చంద్రబాబు రేపు (ఏప్రిల్ 6) తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జరిగే



కార్యక్రమంలో పాల్గొననున్నారు.

**100 రోజుల కార్యాచరణ.. సాగునీటి సంఘాలకు కీలక బాధ్యతలు**

నీటి భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యతే కాదని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తూ వారికి కీలక బాధ్యతలు అప్పగించారు. "ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టుకోవాలి, ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను పెంచాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇరిగేషన్, అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ,

- మిగతా 2లో..



## 2 రోజుల పాటు విభిన్న వాతావరణం

### -- కొన్ని చోట్ల వర్షాలు, మరికొన్ని చోట్ల తీవ్ర ఎండలు

**అమరావతి- సూర్య వాస్తవం**

రానున్న రెండు రోజులు రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ నెల 6, 7 తేదీల్లో మేఘావృతమైన వాతావరణంతో పాటు కొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో తీవ్రమైన ఎండలు ప్రభావం చూపే అవకాశం ఉందని ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణ కోస్తాంధ్ర

- మిగతా 2లో..

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు సీఎం రేవంత్ రెడ్డి నివాళి

**హైదరాబాద్- సూర్య వాస్తవం**




స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## హైకోర్టు జోన్-11

# భవన నిర్మాణానికి శంకుస్థాపన



**హైదరాబాద్- సూర్య వాస్తవం**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో నిర్మించనున్న హైకోర్టు జోన్--11 భవనానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు, హైకోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దు కుంటున్న ఈ కొత్త ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో కోర్టు గదులు, డిజిటల్ లైబ్రరీలు, పరిపాలనా విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు రెండో దశలో న్యాయమూర్తుల నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రస్తుత అవసరాలకు హైకోర్టు సరిపోవడం

- మిగతా 2లో..



### అణగారిన తరగతులహక్కుల కోసం

# జగ్జీవన్ రామ్ కృషి

### - గవర్నర్ అబ్దుల్ నజీర్

**అమరావతి - సూర్య వాస్తవం**

దేశంలో అణగారిన తరగతుల హక్కుల కోసం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ కృషి చేశారని గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా విజయవాడలోని లోక్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో గవర్నరు ఆయనకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడంతో హరిత విప్లవానికి నాంది పలికారని తెలిపారు. దీంతో దేశంలో

- మిగతా 2లో..

# విద్వేషం జొప్పిస్తున్న బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

హిమంత క్షమాపణలు కోరినా.. వదిలిపెట్టబోమని, చట్టపరంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని రాహుల్ అన్నారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్య మంత్రిగా రాహుల్ పేర్కొన్నారు. అసోంకు చెందిన సుప్రసిద్ధ గాయకుడు, కీర్తిశేషులు జుబిన్ గర్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు.

తమ కాంగ్రెస్ పార్టీ భావజాలం కూడా అలాంటిదేనని, ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే తమ సిద్ధాంతమని తెలిపారు. అస్సాంలో తాము అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో దోషులను 100 రోజుల్లోగా శిక్షిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక తరగతులకు షెడ్యూలు తెగ (ఎస్టీ) హోదా ఇస్తామని, తేయాకు కార్మికులకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని బీజేపీ సర్కారు రాష్ట్ర ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని బీజేపీ ఏటీఎంగా మార్చేశారని విమర్శించారు.

# అణగారిన తరగతుల హక్కుల కోసం జగ్జీవన్ రామ్ కృషి

(మొదటిపేజీ తరువాయి)

ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.

**వ్యవసాయ ఆధునీకరణకు జగ్జీవన్‌రామ్ కృషి : సిఎం చంద్రబాబునాయుడు**

వ్యవసాయాన్ని ఆధునీకరించడంతో పాటు ఆహార సంక్షోభ సమయంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ దేశాన్ని గట్టెక్కించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్ లాంటి ఎన్నో సంస్కరణలు అమలు చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

**దేశాభివృద్ధికి తుదిశ్వాస వరకూ కృషి : వైఎస్ జగన్**

కార్మికుల హక్కులు, రైతుల సంక్షేమం, దేశ ఆర్థికాభివృద్ధి, అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన గొప్ప నాయకుడు బాబూ జగ్జీవన్ రామ్ అని వైసిపి అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

# హైకోర్టు జోన్-11 భవన నిర్మాణానికి శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

లేదు. అలాగే ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనానికి హెరిటేజ్ గుర్తింపు ఉంది. చరిత్రను కాపాడుకుంటూ కొత్త భవన సముదాయం నిర్మిస్తున్నామన్నారు. రాబోయే వందేళ్ల వరకు ప్రజలు వచ్చేలా హైకోర్టు నిర్మాణం ఉండబోతోందన్నారు. న్యాయశాఖకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫస్ట్ డిసిషన్ హైకోర్టు నిర్మాణంపైనే తీసుకున్నామని వచ్చే ఏడాది డిసెంబర్ లోపు హైకోర్టు జోన్ -2 నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జ్యుడీషియరీ వ్యవస్థలు స్వతంత్రంగా పని చేస్తాయన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయం కీలకమైన మూలస్తంభం. న్యాయ వ్యవస్థ పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం ఉందన్నారు. ఇండియాలోని హైకోర్టు భవనాలతో పోల్చితే అతి పెద్ద భవనంగా ఇది నిలుస్తుందన్నారు.

# బాబూ జగ్జీవన్‌రామ్‌కు సీఎం రేవంత్ రెడ్డి నివాళి

(మొదటిపేజీ తరువాయి)

నివాళులర్పించారు. అణగారిన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని సీఎం కొనియాడారు. కుల వివక్ష, అంటరానితనానికి ఆయన వ్యతిరేకంగా పోరాడారనీ, దళితుల హక్కుల కోసం జీవితాంతం పనిచేశారని గుర్తు చేశారు. బాబూజీ స్ఫూర్తితో రాష్ట్రంలో సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. సామాజిక న్యాయం కోసం కృషి చేశారు.

**మంత్రి వివేక్ వెంకటస్వామి నివాళి**

బాబూ జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం కోసం కృషి చేశారని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ ఏ హోదాలో ఉన్నా కూడా కష్టపడి పనిచేసి, సామాజిక న్యాయం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు అపారమైనవని గుర్తు చేశారు. జగ్జీవన్‌రామ్ రక్షణ మంత్రిగా ఉన్న సమయంలోనే మన దేశం 1971 యుద్ధంలో విజయం సాధించిందని గుర్తు చేశారు.

# 2 రోజుల పాటు విభిన్న వాతావరణం

(మొదటిపేజీ తరువాయి)

-- పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని తెలిపారు. రాయలసీమ, పరిసర ప్రాంతాలపై మరో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొన్నారు. వీటి ప్రభావంతో సోమ, మంగళవారాల్లో మేఘా వృతమైన వాతావరణంతో పాటు పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్ర, కోస్తాలో పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. సోమవారం పోలవరం జిల్లా చింతూరు, ఎన్‌టిఆర్ జిల్లా జి కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో వడగాడ్పుల ప్రభావం చూపనున్నట్లు తెలిపారు.

# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

దాని ప్రకారం...కూలిపోయిన యుద్ధ విమానానికి చెందిన పైలట్ కోసం గాలింపు జరుపుతున్న అమెరికా రెస్క్యూ విమానం సీ-130ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ ధ్వంసం చేసింది. ఖతార్ మీడియా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. గాలింపు చర్యలు చేపట్టిన విమానాలకు రీఫ్యూయలింగ్ చేయడానికి సీ-130 వచ్చింది. అయితే అందులోని సిబ్బంది ఏమైందీ తెలియ లేదు. గాలింపు సమయంలో ఇరాన్ దళాలు అనేక అమెరికా విమానాలను ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా ఇరాన్ దళాలు జరిపిన దాడులలో ఐదుగురు చని పోయారు. కూల్చివేతకు గురైన వాటిలో సీ-130 విమానంతో పాటు రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు కూడా ఉన్నాయి.

**పైలట్‌ను రక్షించాం : ట్రంప్**

ఇరాన్‌లో చిక్కుపోయిన రెండో పైలట్‌ను రక్షించామని, ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వతాల్లో అతనిని గుర్తించారని, ప్రస్తుతం అతను అమెరికా బలగాల రక్షణలో ఉన్నాడని తెలిపారు. పైలట్‌ను తీసుకొని రావడానికి ప్రపంచంలోనే అత్యం త ప్రాణాంతక ఆయుధాలతో అనేక విమానాలను పంపా మన్నారు. పైలట్ గాయపడినప్పటికీ కోలుకుంటున్నాడని చెప్పారు.

**ఇరాన్ సీనియర్ అధికారులను చంపేశాం**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై జరిపిన దాడులలో ఆ దేశానికి చెందిన పలువురు సీనియర్ సైనికాధికారులు చనిపోయారని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దాడికి సంబంధించి ఒక నిమిషం ఏడు సెకన్ల నిడివి కలిగిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. అందులో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలము కున్నాయి. అయితే ఈ దాడులు ఎప్పుడు జరిగిందీ ట్రంప్ వెల్లడించలేదు. తమతో ఒప్పందం చేసుకొని, హర్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో నరకాన్ని చవిచూడాల్సి ఉంటుందంటూ హెచ్చరిక జారీ చేసిన తర్వాత ట్రంప్ ఈ వీడియోను విడుదల చేయడం గమనార్హం. ఇరాన్ కూడా ఈ దాడులపై ఇంతవరకూ స్పందించలేదు. ఇదిలావుండగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ కమాండర్ ఖస్సెమ్ సోలైమని బంధువుగా గుర్తించిన ఓ మహిళ శాశ్వత నివాస హోదాను అమెరికా రద్దు చేసింది. సొలైమని బంధువు హమిదెహ్ సొలైమని అఫ్షర్‌ను, ఆమె కుమార్తెను ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారని, వారిని దేశం నుంచి బయటికి పంపే ప్రయత్నం జరుగుతోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు.

**కువైట్ చమురు సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ దాడి**

గల్ఫ్‌లోని కువైట్‌పై ఇరాన్ ఆదివారం విరుచుకు పడింది. షువైఖ్ చమురు సెక్టార్ ప్రాంగణంపై డ్రోన్ దాడి జరిపింది. దీంతో అక్కడ పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ కాంప్లెక్స్‌లో చమురు మంత్రిత్వ శాఖ కార్యాలయం, కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఉన్నాయి. దాడిలో ఆస్తినష్టం గణనీయంగానే జరిగిందని తెలుస్తోంది. విద్యుత్-డీశాలినేషన్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ డ్రోన్లను ప్రయోగించగా రెండు విద్యుదుత్పత్తి యూనిట్లలో కార్యకలాపాలు నిలిచి పోయాయి. ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చిన క్షిపణులు, డ్రోన్లను తమ రక్షణ వ్యవస్థలు సమర్ధవంతంగా అడ్డుకున్నాయని కువైట్ తెలిపింది. ఈ కారణంగా భారీగా పేలుడు శబ్దాలు వినిపించాయని చెప్పింది. కువైట్‌లోని ఓ ప్రభుత్వ భవనంపై కూడా డ్రోన్ దాడి జరిగిందని తెలుస్తోంది. కాగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను అడ్డుకునే క్రమంలో శకలాలు భూమిపై పడి అబూధాబీలోని బోరగ్ పెట్రోకెమికల్ ప్లాంటులో పలు దఫాలుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన నేపథ్యంలో ప్లాంటులో కార్యకలాపాలను వెంటనే నిలిపివేశారు. అటు యూఏఈలోని అల్యూమినియం పరిశ్రమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడులు జరిపింది.

**నరక ద్వారాలు మీ కోసమే తెరిచి ఉన్నాయి : ఇరాన్ హెచ్చరిక**

తమతో ఒప్పందానికి రావాలని, హర్మూజ్ జలసంధిని తెరవాలని, లేకుంటే నరకం చూస్తారని ట్రంప్ జారీ చేసిన హెచ్చరికలను ఇరాన్ బేఖాతరు చేసింది. ట్రంప్ జారీ చేసిన అల్టిమేటంను తోసిపుచ్చింది. అది నిస్సహాయతతో, భయాందోళనలతో జారీ చేసిన హెచ్చరిక అని ఎద్దేవా చేసింది. 'అందులో పొంతన లేదు. ఆయనది తెలివితక్కువ చర్య. మేము ఇస్తున్న సందేశం యొక్క అర్థమేమిటంటే నరక ద్వారాలు మీ కోసం తెరిచి ఉంటాయి' అని ఖతం అల్-అన్బియా కేంద్ర కార్యాలయానికి చెందిన జనరల్ అలీ అబ్దోల్లహీ అలియాబది హెచ్చరించారు.

**అణు స్థావరాలపై దాడులను ఖండించండి : ఐరాసను కోరిన ఇరాన్**

తమ అణు స్థావరాలపై అమెరికా-ఇజ్రాయిల్ దళాలు జరుపుతున్న దాడులను ఖండించాల్సిందిగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్‌ను కోరారు. ఈ మేరకు గుటెరెస్‌కు రాసిన లేఖను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంటుపై పదే పదే జరుగుతున్న దాడులు మధ్యప్రాచ్యంలో మానవ, పర్యావరణ ప్రమాదాలకు దారితీస్తాయని అరాగ్చీ హెచ్చరించారు. బుషెహర్ స్థావరంపై జరుగుతున్న దాడులను సహించలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. రేడియో ధార్మిక పదార్థాలు కలుషితమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. బుషెహర్ ప్లాంటుపై నాలుగు సార్లు దాడి జరిగిందని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ఆయన తెలియజేశారు. రేడియో ధార్మిక పదార్థాలు విడుదలైన పక్షంలో టెహ్రాన్ కంటే గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలకే ముప్పు ఎక్కువ అని చెప్పారు.

**లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు: ఈయూ దేశాల ఆర్థిక మంత్రుల సూచన**

ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలతో లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు విధించాలని ఐదు యూరోపియన్ దేశాల ఆర్థిక మంత్రులు సూచించారు. ఈ మేరకు జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా దేశాల ఆర్థిక మంత్రులు ఈయూ కమిషన్‌కు ఓ లేఖ రాశారు. 'మనమంతా సంఘటితంగానే ఉన్నామని, చర్య తీసుకునేందుకు సిద్ధమేనని సంకేతం పంపడానికి ఇలాంటివి అవసరం' అని వారు అభిప్రాయపడ్డారు. చమురు కంపెనీలపై భారీగా పన్నులు విధించడం ద్వారా సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందని వారు తెలిపారు.

**లెబనాన్‌లో 17 ఐరాస కెమేరాలు ధ్వంసం**

దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక కేంద్ర కార్యాలయానికి చెందిన 17 నిఘా కెమేరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. కోస్తా ప్రాంతంలోని నఖురా పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమేరాలను ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేశాయని పేరు చెప్పడానికి ఇష్టపడని ఐరాస భద్రతాధికారి ఒకరు చెప్పారు. ఓ రకమైన లేజర్ సాయంతో వీటిని పనికి రాకుండా చేశారనిలెబనాన్‌లో ఐరాస తాత్కాలిక దళాల (యునిఫిల్) ప్రతినిధి కండిస్ అర్డియల్ తెలిపారు. పట్టణంలో తిష్ట వేసిన ఇజ్రాయిల్ సేనలు అక్కడి భవనాలను పెద్ద సంఖ్యలో నేలమట్టం చేశారని ఆమె అన్నారు.

# ఉద్యమంలా నీటి భద్రత

(మొదటిపేజీ తరువాయి)

పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి సాగునీటి సంఘాలకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నీటి భద్రతను సాధిస్తే మిగిలిన అన్ని రంగాల్లో అభివృద్ధి దానంతట అదే సాధ్యమవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

**పక్కా ప్రణాళికతో పనులు.. జులై 14 డెడ్‌లైన్**

ఈ 100 రోజుల కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను ప్రకటించింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రణాళికను రూపొందించారు.

**ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 వరకు: చేపట్టాల్సిన పనుల గుర్తింపు.**

ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 20 వరకు: గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతుల మంజూరు.

ఏప్రిల్ 21 నుంచి జూలై 9 వరకు: క్షేత్రస్థాయిలో పనుల అమలు. జూలై 10 నుంచి జూలై 14 వరకు: పూర్తి చేసిన పనులపై నివేదికల సమర్పణ. ఈ షెడ్యూల్ ప్రకారం 'మిషన్ అప్రోచ్'తో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సీఎం అధికారులకు, సాగునీటి సంఘాల సభ్యులకు సూచించారు.

**అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో.. భూగర్భ జలాల పెంపే లక్ష్యం**

నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపులో అన్నమయ్య జిల్లా సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. 'జలధార' పేరుతో ఆ జిల్లాలో చేపట్టిన చర్యలు అద్భుత ఫలితాలనిచ్చాయని, స్థానిక జలవనరులను వినియోగించుకుని, చెరువులను నింపి భూగర్భ జలాలను గణనీయంగా పెంచారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 8.7 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలను, కనీసం 1.5 మీటర్ల మేర పైకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

**పూడికతీత నుంచి వాటర్ బడ్జెట్ వరకు.. చేయాల్సిన పనులివే**

ఈ 100 రోజుల్లో చేపట్టాల్సిన పనులపై సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫీడర్ ఛానెల్లను శుభ్రం చేయడం, చెరువులు, కాల్వల్లో పూడిక తీయడం, గుర్రపు డెక్కను తొలగించడం వంటి పనులను వెంటనే చేపట్టాలన్నారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, వరద ముంపును కూడా అరికట్టవచ్చని తెలిపారు.

అవసరమైన చోట చెక్ డ్యాంలకు మరమ్మతులు చేయడం, కొత్త నిర్మాణాలు చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా, ప్రతి సాగునీటి సంఘం తమ పరిధిలో 'వాటర్ బడ్జెట్' తయారు చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యత, అవసరాలపై స్పష్టమైన అంచనాతో ముందుకు సాగాలన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు.

**కరవు రహిత రాష్ట్రమే ధ్యేయం.. ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి**

కొద్దిపాటి శ్రద్ధ పెడితే రాష్ట్రంలో నీటి సమస్యను అధిగమించి, కరవు రహిత రాష్ట్రంగా మార్చవచ్చని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందని అన్నారని, కానీ నేడు హార్టీ కల్చర్ హబ్‌గా మారిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులతో పాటు, నేడు పోలవరం సహా పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. గతేడాది (2024 మే నుంచి 2025 మే వరకు) ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు 2.20 మీటర్ల మేర పెరిగాయని, అంటే సుమారు 200 టీఎంసీల నీటిని అదనంగా భూమిలో ఇంకించగలిగామని తెలిపారు. అదే స్ఫూర్తితో ఈ 100 రోజుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## హోర్ముజ్ జలసంధిని దాటిన

# మరో భారత నౌక 'గ్రీన్ ఆశా'

**టెహ్రాన్ - సూర్య వాస్తవం**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తల నడుమ మరో భారత జెండాతో ఉన్న ఎల్‌పిజి నౌక 'గ్రీన్ ఆశా' హోర్ముజ్ జలసంధిని దాటింది. ఈ ప్రాంతంలో సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఈ కీలక సముద్ర మార్గాన్ని దాటిన



తొమ్మిదో భారత ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం హోర్ముజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. గ్రీన్ ఆశా కంటే ముందు బిడబ్ల్యూ టైర్, బిడబ్ల్యూ ఎల్మ్ అనే రెండు ఎల్‌పిజి నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను రవాణా చేశాయి. మార్చి నెలలో ఎంటి శివాలిక్, ఎంటి నందా దేవి అనే ట్యాంకర్లు 92,700 టన్నుల ఎల్‌పిజిని గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులకు చేర్చాయి. ముడి చమురు, ఇతర ఇంధన నౌకలు కూడా ఈ మార్గంలో ప్రయాణించాయి. 'జగ్ లాడ్కి' అనే ఆయిల్ ట్యాంకర్ యుఎఇ నుండి 80,000 టన్నుల ముడి చమురును ముంద్రా పోర్టుకు తీసుకురాగా, 'జగ్ ప్రకాశ్' నౌక ఒమన్ నుంచి ఆఫ్రికా మార్కెట్లకు గ్యాసోలిన్‌ను చేరవేసింది.

# యుద్ధంతో ట్రంప్‌నకు తలనొప్పి

- ఓవైపు అమెరికాకు కీలక ఆయుధాలు కరవు.. మరోవైపు బెదిరింపులు
- వేధిస్తున్న జేఎంఎస్ఎస్ఎం-ఈఆర్ క్షిపణుల కొరత



**వాషింగ్టన్ - సూర్య వాస్తవం:** ఇరాన్‌తో యుద్ధం మరింత తీవ్రమైన వేళ అమెరికా ప్రపంచ వ్యాప్తంగా వివిధ స్థావరాల్లో మోహరించిన ఓ ఆయుధాన్ని పశ్చిమాసియా వైపు తరలిస్తోంది. అమెరికా అమ్ములపొదిలో ఉన్న ఈ క్షిపణి నిల్వల్లో మూడొంతులకుపైగా ఇరాన్‌పై గురిపెట్టింది. ఆ ఆయుధం పేరు జాయింట్ ఎయిర్ టు సర్ఫేస్ స్టాండాఫ్ మిసైల్-ఎక్స్‌టెండెడ్ రేంజి (జేఎంఎస్ఎస్ఎం-ఈఆర్). ఇదొక క్రూజ్ క్షిపణి. దీన్ని అమెరికా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన స్థావరాల్లో మోహరించింది. ఇరాన్‌పై యుద్ధం తీవ్రం కావడంతో మార్చి చివర్లో ఈ క్షిపణులను పశ్చిమాసియాలోని సెంట్రల్ కమాండ్‌కు, యూకేలోని ఫెయిర్‌ఫోర్డ్ బేస్‌కు పంపించాలని ఆదేశాలు జారీ చేసింది.

**ఒక్కో క్షిపణి విలువ 1.5 మిలియన్ డాలర్లు**

ఒక్కో జేఎంఎస్ఎస్ఎం- ఈఆర్ విలువ 1.5 మిలియన్ డాలర్లు. దీని రేంజి 600 మైళు. వీటిని లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ తయారు చేస్తోంది. శత్రుదేశాల మధ్యలో ఉండే హైవాల్యూ టార్గెట్లపై ప్రయోగించేందుకు దీన్ని డిజైన్ చేశారు. ఇందుకోసం అమెరికా విమానాలు శత్రుదేశ గగనతలంలోకి ప్రవేశించాల్సిన అవసరం లేదు. ఈ క్షిపణిని గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించలేవు. వీటిని అమెరికా వద్ద ఉన్న స్ట్రాటజిక్ బాంబర్ విమానాలు బీ-1బీ లాన్సర్, బీ-52 స్ట్రాటోఫోర్ట్రస్‌లు, కొన్ని రకాల ఫైటర్ జెట్‌లు మాత్రమే ప్రయోగించగలవు. ఇరాన్ యుద్ధం ప్రారంభానికి ముందు అమెరికా వద్ద 2,300 జేఎంఎస్ఎస్ఎం- ఈఆర్ క్షిపణులున్నాయి.

వీటిని యుద్ధంలో విరివిగా వినియోగించడంతో నిల్వలు భారీగా తగ్గిపోయాయి. ప్రస్తుతం 425 మాత్రమే ఉన్నట్టు అంచనా. 2009లో 6,200 క్షిపణుల వేరియంట్ల కొనుగోలుకు అమెరికా నిధులు కేటాయించింది. ఆ తర్వాత నిధుల కేటాయింపులు పెద్దగా లేకపోవడంతో బేస్ మోడల్ క్షిపణుల తయారీ పదేండ్ల క్రితమే నిలిచిపోయింది. మరోవైపు యుద్ధం ప్రారంభ వారాల్లోనే 1,000 జేఎంఎస్ఎస్ఎం- ఈఆర్ లను అమెరికా ఉపయోగించింది. ఈ నేపథ్యంలో వీటిని మళ్లీ భర్తీ చేయాలంటే కొన్నేండ్లు పడుతుంది. ఈ ఏడాది లాక్‌హీడ్ మార్టిన్ 400 క్షిపణులను మాత్రమే ఉత్పతి చేస్తుందన్న అంచనాలున్నాయి. దీన్ని 860 వరకు పెంచే అవకాశం ఉంది. అలా చూసినా.. 1,000 క్షిపణుల ఉత్పత్తి మాత్రం సాధ్యం కాదు.

## యోగి వేమన పీఠాధిపతి నందవేమారెడ్డికి ఘన సన్మానం

**గాండ్లపెంట - సూర్య వాస్తవం :** మండలంలోని కటారుపల్లి పల్లి గ్రామంలోని యోగి వేమన గుడి పీఠాధిపతి అయినటువంటి నంద వేమారెడ్డి కి యోగి వేమన బ్రహ్మోత్స వాలను ఘనంగా నిర్వహించడం వలన టీడీపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. యోగి వేమన బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులు పాటు ఎంతో ఘనంగా కనువిందు చేసేలా పుష్పగుచ్చాలతో అలంకరణలు, సాంస్కృతిక కార్య క్రమాలు, కేరళ వారిచే మంగళ వాయిద్యాలు, నంద్యాల, కర్నూలు, నెల్లూరు వారిచే డాన్స్ ప్రోగ్రాం లతో అత్యంత ఘనంగా నిర్వహించి స్థానిక స్థాయి నుండి జిల్లాలు, రాష్ట్ర స్థాయి వరకు వేమన బ్రహ్మోత్సవాలు తెలిసేలా చేశారని మండల టిడిపి నాయకులు, గ్రామ యువకులు అందరూ కలిసి ఘనంగా సన్మానం చేసి , కేకు కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు.



# ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా ముగిసేలా సమిష్టిగా కృషి చేద్దాం

## - జిల్లా ఎస్పీ పి.జగదీష్

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాలోని యాడికి మండలంలో పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో... పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు ఈరోజు యాడికిలోని టిటిడి కళ్యాణ మండపంలో బందోబస్తులో పాల్గొననున్న పోలీసు అధికారులతో ఎస్పీ గారు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏమి చేయాలో, ఏమి చేయకూడదో దిశానిర్ధేశం చేశారు. యాడికి మండలం వేములపాడు గ్రామంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ తో మొదలు సీఎం




పర్యటించే యాడికి మార్కెట్ యార్డు సభా ప్రాంగణం,



సభా వేదిక, వీవీఐపీ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, మీడియా గ్యాలరీ, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను మరియు పెండేకల్లు రిజర్వాయర్ తీర ప్రాంతంలో ఎస్పీ గారు స్వయంగా పరిశీలించి, కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ అమలు చేయడం, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలకు ముందస్తుగా తెలియజేయడంతో పాటు వాహన రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసమావేశంలో తాడిపత్రి ఏఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి , ట్రైనింగ్ అధికారి అశ్విన్ మణిదీప్ మరియు పలువురు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సి.ఐ లు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సభ్యుడి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

## - జనసేన సభ్యత్వంతో కుటుంబానికి ఆర్థిక భరోసా





**రాయదుర్గం - సూర్య వాస్తవం :** గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన సభ్యుడు రంగప్ప కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. రాయదుర్గం పట్టణంలో జనసేన పార్టీ ఇంచార్జ్ మంజునాథ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రంగప్ప నివాసానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంజునాథ్ గౌడ్ మాట్లా డుతూ, గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన రంగప్ప కుటుంబానికి జనసేన పార్టీ ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. రంగప్ప జనసేన పార్టీ సభ్యుడు కావడంతో, ఆయన కుటుంబానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రూ.5 లక్షల చెక్కును జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం ఆదివారం సాయంత్రం రంగప్ప కుటుంబ సభ్యులకు ఆ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

# ఆదిమూలం ఆరోపణలు అర్ధరహితం



**పిచ్చాటూరు- సూర్యవాస్తవం:** సత్యవేదు నియోజక వర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేసిన ఆరోపణలు పూర్తిగా అర్థ రహితమని, ఆయన విరక్తితో మాట్లాడుతున్నారని.. ప్రత్యేకంగా సత్యవేదు నియో జకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డిపై చేసిన ఆరోపణలు హాస్యా స్పదంగా ఉన్నాయని పిచ్చాటూరు మండల దళిత నాయకులు రజని, డేవిడ్ అన్నారు. శనివారం పిచ్చా టూరులో వారు విలేకర్ల సమావేశంలో వారు మాట్లా డారు. కోనేటి ఆదిమూలం ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయబడి పార్టీలో లేని పరిస్థితిలో ఉన్న విషయం ప్రజలకు తెలిసిందేనని.. అలాంటి పరిస్థితిలో ఆయన చేసిన విమర్శలకు ఎలాంటి ప్రాముఖ్యత లేదన్నారు. కూరపాటి శంకర్ రెడ్డి ఎటువంటి గ్రావెల్, ఇసుక క్వారీలను నిర్వహించడం లేదని.. మైనింగ్ అనుమతులు పొందిన ప్రైవేట్ వ్యక్తులే వాటిని నిర్వహిస్తున్నారని .. ఈ వాస్తవాలు తెలియకపోవడం విచారకరమని వాపోయారు. కూరపాటి శంకర్ రెడ్డి ప్రభుత్వ ఆదేశాల మేరకు.. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థ వంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామం, ప్రతి మండలంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని.. అదనంగా ఆయన సొంత నిధులతో కూడా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రొటోకాల్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల వద్ద, జిల్లా కలెక్టర్ వద్ద పరిష్కరించుకోవడం సముచితమన్నారు. వ్యక్తిగత అక్కసుతో కూరపాటి శంకర్ రెడ్డిపై ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. కూరపాటి శంకర్‌రెడ్డిని నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా నియమించిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలు గణనీయంగా వేగం పుంజుకున్నాయని.. ఈ విషయాన్ని విస్మరించడం అన్యాయమని తెలిపారు. “మీరు పార్టీలో సస్పెండ్ అయిన కారణాలు ప్రజలకు తెలిసినవే. ఇంకా బయటకు రాని అనేక విషయాలు ఉన్నాయని కూడా ప్రజలు భావిస్తున్నారు. మీకు సస్పెన్షన్‌పై అభ్యంతరం ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వద్ద మీరే నిరూపించుకోవాలి. మీకు పార్టీ సీటు ఇచ్చి, కార్యకర్తలు కష్టపడి మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించిన తర్వాత పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయడం బాధాకరం. ఏడు మండలాల్లో మీకు వ్యతిరేకంగా నాయకులు పనిచేశారని మీరు నిరూపించి ఉంటే పార్టీ క్రమశిక్షణ చర్యలు తప్పక తీసుకునేది” అన్నారు. పార్టీ కష్టకాలంలో బాధ్యతలు తీసుకొని పనిచేసే వారు పెత్తందారులు కాదని, వారు సేవాభావం కలిగిన నిజమైన నాయకులన్నారు.

సమస్యలను పార్టీ అధిష్టానం వద్ద పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని .. నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రజలు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిచ్చాటూరు మండల దళిత నాయకులు చిన్నదురై, ఏకాంబరం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## వివాహ వేడుకలో తులసి రెడ్డి

**వేంపల్లె సూర్య వాస్తవం:** వేంపల్లి కు చెందిన స్వర్గీయ టీ బాబా కుమారుడు షేక్ బాబా రోహిత్,ప్రొద్దుటూరు కి చెందిన షేక్ సానా ల ఒలీమా కార్యక్రమం ఆదివారం వేంపల్లి మధు రెడ్డి కళ్యాణమండపంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, బండారు వెంకటేశు, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మానవ సంబంధాలలో దాంపత్య బంధం అన్నిటికంటే ముఖ్యమైనదని, ఆ బంధానికి వివాహం చట్టబద్ధత,సామాజిక భద్రత కల్పిస్తుందని అన్నారు.

## కేశఖండన మహోత్సవంలో తులసి రెడ్డి



**వేంపల్లె సూర్య వాస్తవం:** శ్రీమతి సారికా రెడ్డి, రామ మణికంఠ రెడ్డి దంపతుల కుమార్తె మహన్యా రెడ్డి కేశఖండన మహోత్సవం కడప జిల్లా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం, వేముల మండలం,శ్రీ మోపూరి భైరవేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, బండారు వెంకటేశు నామా వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆటలు, ధ్యానంతో ఆరోగ్యం

**- వై.నాగేశ్వరరావు యాదవ్, డిసిఎంఎస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు**



**కర్నూల్ - సూర్య వాస్తవం:** కర్నూల్ లోని అవుట్ డోర్ స్టేడియంలో బాస్కెట్బాల్ పోటీలు సీఈవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, స్టేట్ డైరెక్టర్స్ సంజీవ లక్ష్మి, వలసల రామకృష్ణ, విజయలక్ష్మి తుడిచెర్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శ్రీరాములు, డీసీఎంస్ మేనేజర్ రాజేష్, బాస్కెట్ బాల్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని బాస్కెట్బాల్ పోటీలను ప్రారంభించడం జరిగింది. ప్రతి ఒక్క విద్యార్థి ఆటలలో మంచి ప్రతిభ ప్రదర్శించాలని, ఆరోగ్యానికి ఆనందానికి ఆటలు ఎంతో ఉపయోగమని, మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్క విద్యార్థి ఆటలలో పాల్గొని సర్టిఫికెట్ పొందిన వారికి ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్లు కల్పించారని ఈ సందర్భంగా తెలియజేశారు.

# నేడు జేఎన్టీయూ 15వ స్నాతకోత్సవం

**- ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక - వీసీ సుదర్శన్ రావు వెల్లడి**



**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం జేఎన్టీయూ 15వ వార్షిక స్నాతకోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో సోమవారం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ హెచ్ .సుదర్శన్ రావు తెలిపారు. జేఎన్టీయూలోని ఆర్యభట్ట ఆడిటోరియంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన పలు విషయాలను వివరించారు. ముఖ్యంగా ఎన్టీఆర్ ఆడిటోరియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఇప్పటికే విశ్వవిద్యాల యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నట్లు ప్రకటించారు. వేడుకల్లో ప్రముఖ విద్యావేత్త డా. టెస్సీ థామస్ ఫార్మర్ డైరెక్టర్ జనరల్ (ఏరోనాటికల్ సిస్టం) డీ.ఆర్.డీ.ఓ, ఎన్ .ఐ.సీ. హెచ్.ఈ యూనివర్సిటీ కన్యాకుమారి తమిళనాడు గౌరవ అతిథిగా స్నాతకోత్సవ వక్తగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తా రని వెల్లడించారు. వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యూనివర్సిటీ టాపర్లకు ఛాన్సలర్ చేతుల మీదుగా 45 బంగారు పథకాలను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పీ. హెచ్.డీ పట్టాలు, అర్హులైన స్కాలర్లకు డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారన్నారు..130 మంది పైగా విద్యార్థులకు జేఎన్టీయూ-ఏ అనుబంధ స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వ కళాశాలలో నుండి 40,782 మంది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అధికారికంగా పట్టాలను ప్రధానం చేయనున్నట్లు వైస్ ఛాన్సలర్ తెలిపారు.గత ఏడాది కాలంలో యూనివర్సిటీ సాధించిన ప్రగతి, పరిశోధనలు, ర్యాంకింగ్ వివరాలను వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు వార్షిక నివేదికను సమర్పించనున్నారు. బంగారు పతక గ్రహీతలు, పీ.హెచ్.డీ పట్టాదారులు ఉదయం 8.30 గంటలకు నిర్ణీత దుస్తులతో వేదిక వద్దకు చేరుకోవాలని అనంతరం రిహార్సల్స్ లో పాల్గొనాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో 12 సంవత్సరాలలోపు పిల్లలకు ఆడిటోరియంలోకి ప్రవేశం ఉండదని, ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఆడిటోరియంలోకి ఆహ్వాన పత్రిక లేదా ఎంట్రీ పాస్ ఉన్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. భద్రత కారణాల దృష్ట్యా సెల్ ఫోన్లు, కెమెరాలు అనుమతించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ప్రత్యేకంగా యూనివర్సిటీ అధికారిక యూట్యూబ్ ఛానల్, వెబ్సైట్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్ ఆఫ్ ఎమ్మెల్యేషన్స్ నాగప్రసాద్, డీఏపీ ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ, పీ.ఆర్.ఓ ప్రొఫెసర్ ఓం ప్రకాష్ పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు దగ్ధం

**- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు**

**వేంపల్లె- సూర్య వాస్తవం:** వేంపల్లె మండలం లోని వీరన్నగట్టుపల్లి వద్ద లెవెన్ కె.వి విద్యుత్ వైర్లు తగిలి ఆర్టీసీ బస్సు దగ్ధం అయింది.కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేంపల్లె నుంచి కదిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ వైర్లు బస్సు టాప్‌పై తగలడంతో ఆర్టీసీ బస్సులో మంటలు తెలరేగా .బస్సులో 25 మంది ప్రయాణికులు కేకలు వేయ డంతో ఆర్టీసీ డ్రైవర్ బస్సును ఆపి వేశారు. దీంతో సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు. ఫైర్ అధికారులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ అధికారులు తృటిలో పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న బస్సులో ఉన్న ప్రయాణికులు.



## క్రీస్తు పునరుత్థానమే ఈస్టర్ పండుగ

**లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం:** మండలం లోని క్రైస్తవులందరూ ఆదివారం నాడు ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మికంగా ఘనంగా జరుపుకు న్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా మండలంలోని చర్చిలన్నీ కూడా విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరం గా ముస్తాబయ్యాయి. మానవాళి కోసం సిలువలో ప్రాణత్యాగం చేసిన యేసు క్రీస్తు చనిపోయిన మూడో రోజు సమాధి నుంచి తిరిగి లేచిన రోజున ఈస్టర్ పండగ జరుపుకుంటారని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి రెవరెండ్ ఫాదర్ విజయ్ మోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుండే ఈస్టర్ ప్రత్యేక ప్రార్ధనలను ఆరాధనలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా క్రీస్తు ప్రభువు పునరుత్థానం చేసిన రోజు ఈస్టర్ అని క్రైస్తవులంతా కూడా పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా ఆయన అన్నారు పరస్పర సహకార గుణాలతో అన్ని వర్గాల వారు జీవించాలని ప్రభువు శాంతి సందేశాన్ని అందించారు.

# హిందీ భాషతో ప్రపంచ దేశాల్లో గుర్తింపు

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యవాణి**



**అనంతపురం - సూర్య వాస్తవం:** హిందీ భాష నేర్చుకుంటే ప్రపంచ దేశాల్లో రాణించడం సులభమవుతుందని అనంతపురం జిల్లా మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.సత్యవాణి అన్నారు. హిందీ సేవా సదన్ వ్యవస్థాపక కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వ సహకార, భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ హిందీ సలహా సభ్యుడు ఎస్. గైబువల్లి ఆధ్వర్యంలో విశిష్ట హిందీ ప్రతిభా రత్న పురస్కార్-2025 అవార్డుల ప్రధానోత్సవం అనంతపురం ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యవాణి తన సందేశాన్నిచ్చారు. హిందీ భాషపై పట్టు సాధించగలిగితే ప్రపంచ దేశాల్లో ఉద్యోగావకాశాలకు అపారమైన అవకాశాలు ఉంటాయన్నారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ హిందీ సలహా సభ్యురాలు మిలంద్ ప్రకాశన్ అధినేత శృతికాంత్ భారతి, హైకోర్టు న్యాయవాది వెంకటరామ్ నరసింహారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పూజారి పద్మశ్రీ,, గోళ్ల జెడ్పీ స్కూల్ హెడ్మాస్టర్ అజ్మతుల్లా హాజరయ్యారు. వారు తమ సందేశాన్నిచ్చారు. హిందీ భాషాభివృద్ధికి గైబువల్లి చేసిన, చేస్తున్న కృషిని వక్తలు కొనియా డారు. పాఠశాల స్థాయి నుంచే హిందీ భాష నేర్చుకునేలా 6 నుంచి ఇంటర్ వరకు పాఠశాలలు, కళాశాలల్లో హిందీ పాఠ్య పుస్తకాల్లోని అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించడాన్ని అభినందించారు. కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో నిర్వహించిన పరీక్షల్లో వరుసగా మొదటి, రెండో, మూడో స్థానంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యవాణి చేతుల మీదుగా పతకాలు, ప్రమాణ పత్రాలను అందించారు. హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన హిందీ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు, ప్రధానాచార్య లకు, ఆధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులకు విశిష్ట హిందీ ప్రతిభా పురస్కార్-2025 అవార్డులతో సత్కరిం చారు. సీనియర్ న్యాయవాది పద్మజ, సునీత చౌదరి, పద్మావతి, ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగ అధ్యాపకులు నరసింహం, సోమశేఖర్, హిందీ కన్వీనర్లు హాజీ కరీమ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

# "దెబ్బకు దెబ్బ తప్పదు" - పెళ్లకూరులో కాకాణి ఘాటు హెచ్చరిక

**- అక్రమ అరెస్టులపై మండిపాటు - అధికారులకు కఠిన వార్నింగ్**







**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామంలో అక్రమ కేసులో అరెస్టై జైలుకు వెళ్లిన మాజీ నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులను ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు పెళ్లకూరు మండల పరిషత్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి కుటుంబాన్ని కూడా కలిసి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

నెల్లూరు నుంచి పెళ్లకూరుకు బయలుదేరిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి దారి పొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు బొకేలు, శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు నడిచాయి. యువత కాకాణితో ఫోటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీపడింది.

### అక్రమ కేసులపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కాకాణి గోవర్ధన్ రెడ్డి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పై నమోదు చేసిన కేసులను తీవ్రంగా ఖండించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను పరిశీలించడానికి వెళ్లిన వారిపైనే రివర్స్ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మరియు స్థానిక రైతులతో కలిసి ఇసుక రీచ్‌లను పరిశీలించగా అక్కడ అనుమతి లేకుండా యంత్రాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించి ప్రశ్నించారని తెలిపారు. ప్రశ్నించినందుకు ప్రతీకారంగా కఠినమైన సెక్షన్లు చేర్చి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపారని ఆరోపించారు.

### "అధికారులు జర జాగ్రత్త"

ప్రస్తుత పరిస్థితులపై స్పందిస్తూ కాకాణి ఘాటు హెచ్చరికలు చేశారు. అక్రమంగా వ్యవహరిస్తున్న అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఫిర్యాదులను పరిశీలించి చట్టప్రకారం సెక్షన్లు నమోదు చేసేవారని, కానీ ఇప్పుడు ఎవరు ఎక్కువ కాలం జైల్లో ఉండేలా కేసులు పెట్టాలన్న దానిపై దృష్టి పెట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

### "దెబ్బకు దెబ్బ తప్పదు"

అన్యాయంగా వ్యవహరిస్తున్న అధికారులందరి వివరాలను సేకరిస్తూ చిట్టా సిద్ధం చేస్తున్నామని కాకాణి వెల్లడించారు. కాలం మారినప్పుడు తప్పు చేసిన ప్రతి అధికారి తన చర్యలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. "మాపై అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదు. కార్యకర్తలను అక్రమ కేసులతో వేధిస్తే తగిన సమాధానం తప్పదు. దెబ్బకు దెబ్బ తప్పదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**తప్పు చేసిన అధికారుల చిట్టా సిద్ధం చేస్తున్నా**

**అధికార పార్టీకి తొత్తులుగా మారొద్దని హితవు**

### పోలీసుల తీరుపై విమర్శలు

ప్రతిపక్ష నాయకులను భయపెట్టేందుకు నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి పీటీ వారెంట్లతో సంవత్సరాల తరబడి జైళ్లలో ఉంచేలా కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకుల మాటలు నమ్మి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

### కార్యకర్తలకు భరోసా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడాల్సిన అవసరం లేదని కాకాణి తెలిపారు. అక్రమ కేసులు, అరెస్టులతో ప్రతిపక్ష గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని ఉన్న ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని, ప్రజల మద్దతుతో రాబోయే రోజుల్లో మార్పు తప్పదని ఆయన పేర్కొన్నారు.

## కదిరి డివిజన్ వాలీబాల్ టోర్నమెంట్ విన్నర్ గా





## గాండ్లపెంట జట్టు

**గాండ్లపెంట - సూర్య వాస్తవం న్యూస్:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదాన ప్రాంగణంలో జరిగిన కదిరి డివిజన్ వాలీబాల్ టోర్నమెంట్ నందు కదిరి ప్రాంతం లోని 10 మండలాల జట్లు పోటీ పడగా ఫైనల్ మ్యాచ్లో గాండ్లపెంట జట్టు కదిరి జట్టు పై విజయం సాధించింది. కదిరి ప్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు యు.హరి ప్రసాద్, బాబాజాన్, సందీప్, హరూన్, బాబా ఫక్రుద్దీన్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్లో బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ తాహెర్ వలి ముఖ్య అతిథిగా విచ్చేసి విన్నర్స్ మరియు రన్నర్స్ కు కప్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ తో పాటు కదిరి ప్రాంతంలో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వ హించడం, ఉపాధ్యాయులకు ప్రోత్సా హకంగా ఉంటుందని, అదేవిధంగా వారు వ్యాయామ ఉపాధ్యాయుల సహకారం తీసుకొని విద్యార్థులను వివిధ రకాల క్రీడల పట్ల అవగాహన కల్పించడానికి మంచి అవకాశం గా ఉపయోగపడుతుందని, అంతేకాక కదిరి ప్రాంత ఉపాధ్యాయులలో ఐకమత్యానికి ఇది ఒక వేదికగా ఉపయోగపడు తుం దని, ఈ సందర్భంగా వారు తెలియ జేశారు. రాబోయే కాలంలో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించడానికి దోహద పడే విధంగా ఈ టోర్నమెంట్ దిగ్విజయంగా నిర్వహించడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు, కుంచపు శ్రీనివాసులు, నాగరాజు నాయక్, ఆజమ్ బాషా,బిట్రా శ్రీనివాసులు, గంగాధర్ రెడ్డి ముబారక్ మరియు ఉపాధ్యాయులు నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి

# బాబు జగ్జీవన్ రామ్

### - జాతీయ దృక్పథం కలిగిన దలితోద్ధారకుడు బాబు జగ్జీవన్ రామ్



**పులివెందుల సూర్య వాస్తవం:** దళితులకు అంబేద్కర్ రాజ్యాంగంలో హక్కులు కల్పిస్తే,జగ్జీవన్ రామ్ వాటిని చట్ట రూపంలో అమలు చేయడానికి కృషి చేశారని మాజీ మున్సిపల్ ఇంఛార్జి వై ఎస్ మనోహర రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం పులివెందుల లో భాకరాపురం వైఎస్సార్ సీ కార్యాలయంలో తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమలకి ముఖ్య అతిథి హాజరై వైయస్ మనోహర్ రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేసి , చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల కోసం, రైతుల సంక్షేమం కోసం, దేశ ఆర్థికాభివృద్ధి కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన గొప్ప నాయకుడు, తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ . ఆయన జీవితం స్ఫూర్తిదాయకం. నేడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులు పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ

**అంటరానితనం,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాట మహనీయులు జగ్జీవన్ రామ్**

కార్యక్రమంలో స్టేట్ ఎస్సీ సెల్ సెక్రటరీ మరియు మాజీ కౌన్సిలర్ కోళ్ల భాస్కర్ ,మాజీ మున్సిపల్ చైర్మన్ వర ప్రసాద్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప,పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉప అధ్యక్షుడు పార్నపల్లి కిషోర్,



హాఫీజ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ , నూర్ భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రసూల్. కోడి రమణ. రాష్ట్ర కార్యదర్శిచంద్రమౌళి.ఫైర్ రామకృష్ణ, యస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సూరీ. ఎస్ సి తా లూకా అధ్యక్షుడు రవి.ఎక్స్ కో ఆప్షన్ చంద్రమౌళి. కనక. సంపత్. బాల ఎస్ టి నాయకులు. కాపు సామాజిక వర్గం.దళిత నాయకులు, వివిధ హోదాలో ఉన్నటువంటి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ,ప్రజలు పాల్గొన్నారు

## బాబుజగజ్జీవన్ రావ్ చిత్రపటాలకు

## నివాళులర్పించిన టౌన్ సీఐ ఇంతాజ్ భాష బృందం

**డోన్ - సూర్య వాస్తవం** జ్యోతిరావు పూలే అంబేద్కర్ జయంతి వారోత్సవాలలో భాగంగా డోన్ అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ భాషా అధ్యక్షతన డాక్టర్ బాబు జగజీవన్ రావ్ చిత్రపటమునకు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు ఏఈ నాగరాజు అధ్యక్షతన జిల్లా సబ్ బ్రాంచ్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగినది టౌన్ సిఐ మాట్లాడుతూ భారతదేశ మొదటి ఉప ప్రధానమంత్రి ఎస్సీ, ఎస్టీ చట్టాలకు రూపకల్పన కల్పించిన పితామహుని జన్మదినం జరుపుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలియజేశారు నాగరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ఉమ్మడి జిల్లాలలో రక్తదాన శిబిరంలో జిల్లాలో చరిత్రలో ఎవరూ కూడా ఇంత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరంలో ఏర్పాటు చేయలేదని డోన్ డిఎస్పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో డోన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సహకారంతో 580 మంది రక్తదాతలతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడము కర్నూలు నంద్యాల జిల్లా చరిత్రలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు అని



తెలియజేశారు ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు కాల్వ ఓం నారాయణ ఆలా శ్రీరాములు ప్యాపిలి మండలం ఊటకొండ గ్రామ నివాసి చిన్నమద్దయ్య తదితరులు పాల్గొన్నారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జగజీవన్ రావు జ్యోతిరావు పూలే మహనీయుల జయంతులను ఏడు రోజులపాటు వారోత్సవాలుగా జరుపుతామని ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన అధికారు లను సన్మానిస్తూ మహనీయుల చిత్రపటాలను అందజేస్తామని తెలియజేస్తూ రక్తదాన శిబిరమునకు డోన్ ఎస్సై శరత్ కుమార్ రెడ్డి, డోన్ సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్, ఇన్స్పెక్టర్ నాగరాజు సహకారం ఎంతో ఉందని వారు తెలియజేశారు.

## భారత ఉప ప్రధాని

## బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభు త్వ పెన్షనర్ల భవనము లో ప్రె సిడెంట్ అబూబాకర్,కోశాధి కారి జెన్నే కుల్లాయిబాబు ఆ ధ్వర్యంలో మాజి ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి ఘ నంగా నిర్వహించారు.ముం దుగా జగ్జీవన్ రామ్ చిత్ర ప టానికి అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ,కోశాధికారి జెన్నే కు ల్లాయిబాబు పూల మాల వేసి నివాళు లర్పించారు.వక్తల మా ట్లాడుతూ వీరు బీహార్ రాష్ట్రా నికి చెందిన స్వాతంత్ర్య స మర యోధులు,సంఘ సంస్క ర్త,భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు..వీరు చిన్న వయ సులో మదన మోహన్ మా లవ్య వీరి పాఠశాల ను సంద ర్శించిన సమయంలో జగ్జీవన్ స్వాగత ప్రసంగంతొ వారిని ఆ కట్టుకున్నారు.అంటరాని వారి కి సమానత్వం కొరకు వీరు ఆ లిండియా డిప్రెస్ట్ క్లాస్సెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలొ ముఖ్య పాత్ర పోషించారు.నే పాల్,బీహార్ భూకంపం సంభ వించినప్పుడు వీరు చేసిన సే వలు ప్రసంశనీ యం అని కోశా ధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్,అసో సియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయి బా బు,నారాయణరెడ్డి,చెన్నారెడ్డి, లక్ష్మి నారాయణ రెడ్డి,దేవదా స్,వెంకటేష్,నారాయణ శెట్టి విజయ భాస్కర్ రెడ్డి తదితరు లు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం



**కదిరి సూర్య వాస్తవం:** గత నెలాఖరులో ఉద్యోగ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు చల్లగాలి మధుసూదన్ రాజు ఇరిగేషన్ జె ఈ భయపను ఆదివారం శ్రీకృష్ణదేవరాయ పాలకమండలి సభ్యుడు కొమ్ము విజయభాస్కర్ ఘనంగా సన్మానించారు. డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస పద్మావతి కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమానికి విద్యుత్ శాఖ సీజీఎం కొమ్ము సంపత్ కుమార్ ప్రముఖ కాంగ్రెస్ నాయకులు సివి కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణదేవరాయ ఏఈలు చెన్నకృష్ణ లిఖిత్ కుమార్ జే ఏ ఓ ఈశ్వర బాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా పదవి విరమణ పొందిన ఉద్యోగులను సన్మానించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టామని చెప్పారు సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ డాక్టర్ జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా తాము ఈ సత్కారాన్ని అందుకోవడం కూడా తమకు చాలా ఆనందదాయకంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గంగాధర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కరణ ఖర్చులకు ఆర్థిక సాయం

**టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కాటప్ప గారి రామలింగారెడ్డి**



**శింగనమల - సూర్య వాస్తవం:** శింగనమల నియోజకవర్గం బుక్కరా యసముద్రం మండలం కేంద్రంలో అనారోగ్యంతో మరణించిన టీడీపీ కార్యకర్త శేఖర్ దహన సంస్కరణ ఖర్చులకి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, 10000 రూపాయలు ఆర్థికసాయం చేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం మండల కేంద్రం టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకాణికి ఘన స్వాగతం

**యువజన నేత పాలేటి నాగార్జున ఆధ్వర్యంలో ఉత్సాహభరిత స్వాగతం**

**పెళ్లకూరు పర్యటనలో మాజీ మంత్రి కాకాణికి శాలువా కప్పి సన్మానం**

**వైఎస్సార్‌సీపీ శ్రేణుల హర్షధ్వానాల మధ్య ఆత్మీయ కలయిక**



**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలంలో మాజీ మంత్రి డా. కాకాణి గోవర్ధన్ రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షుడు పాలేటి నాగార్జున ముందుండి కాకాణిని ఆత్మీయంగా ఆహ్వానించారు.పెళ్లకూరు పర్యటనకు వచ్చిన కాకాణి గోవర్ధన్ రెడ్డికి పాలేటి నాగార్జున శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం ఇద్దరూ ఆత్మీయంగా చేతులు కలుపుతూ పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షధ్వానాలతో స్వాగతం పలుకుతూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.కాకాణి పర్యటన సందర్భంగా పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత, కార్యకర్తలు అక్కడికి తరలి వచ్చారు. పలువురు యువ నాయకులు కాకాణితో ఫోటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని నాయకులు తెలిపారు.కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్కరణల్లో

# మార్పు తీసుకువచ్చిన చంద్రబాబు

### - ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**శ్రీ సత్య సాయి - బ్యూరో సూర్య వాస్తవం:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథంలో రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్పు తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటి సారిగా ఆదివారం కదిరి రూరల్ మండలం, సున్నపుగుట్ట తాండా గ్రామంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు మంజూరైన ఉచిత సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్స్‌ను ప్రారంభించారు. గ్రామానికి చెందిన మున్నా నాయక్ అనే లబ్ధిదారుడి ఇంటి పైన ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యుత్ శాఖ సీజీఎం కొమ్ము సంపత్ కుమార్ కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి విద్యుత్ శాఖ ఈ ఈ కృష్ణదేవరాయ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం మరియు భారతదేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా నడిపించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు . ఈ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కదిరి నియోజకవర్గంలో 1750 మంది ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు ఉచిత ప్యానల్స్ అందజేయనుందని తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న వాళ్ళు పేదల పైన దుర్గా చార్జీల భారం మోపడంతో పాటు లో వోల్టేజ్ సమస్య గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగాన్ని పట్టి పీడించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని తగ్గించడంతోపాటు



నాణ్యమైన విద్యుత్ ను అందిస్తోందని వివరించారు. రాబోయే కాలంలో ఈ పథకాన్ని బీసీలకు కూడా వర్తింప చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. సిజిఎం సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఈ పథకం ఎస్సీ ఎస్టీలకు చాలా ఉపయోగకరమని ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ పథకం ద్వారా పూర్తి ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని పొందవచ్చు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీజీఎం తిరుపతి సంపత్ కుమార్ ఆర్డీవో వివిఎస్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణ దేవ్, ఏడి శీనా నాయక్,ఏఈ శ్రీనివాసులు నాయక్, ఎంపీడీవో పోలప్ప బిజెపి,జనసేన, కూటమి, నాయకులు గంగాధర్ గంగులప్ప నాగూరు శ్రీనివాస్ రెడ్డి, ఎస్బి చలపతి, బత్తలపల్లి రామచంద్ర రమేష్ బాబు ప్రేమలత రామాంజి వినయ్ కుమార్ చంద్ర ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత అంగన్వాడి టీచర్ విజయభారతి కదిరి రూరల్ మండలం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఐ నిరంజన్ రెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.



**మామిడి కాయలు సేకరించి**

## గల్ఫ్ దేశాలకు ఎగుమతి

**- లూనా ఎక్స్పోర్ట్ అండ్ ఇంపోర్ట్ కొచ్చిన్ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన**

## మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి

**రాయచోటి-సూర్య వాస్తవం:** రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు రాయచోటి వ్యవసా య మార్కెట్ కమిటీ కార్యాలయంలో, లూనా ఇంపోర్ట్ అండ్ ఎక్స్పోర్ట్ కొచ్చిన్ సంస్థ ప్రతినిధి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి పరిసర ప్రాంతాలలోని మామిడి కాయలు దుబాయ్, గల్ఫ్ దేశాలకు 2800 టన్నులు ఏప్రిల్, మే మాసములలో మార్కెట్ యార్డు నందు కొనుగోలు చేసి కంటైనర్ల ద్వారా గల్ఫ్ కంట్రీస్ కి ఎక్స్పోర్ట్ చేయుటకు శనివారం జరిగిన సమావేశం లో రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకొ న్నారని తెలియజేశారు.ఈ విషయంపై లూనా ప్రతినిధులు కోరిన మామిడికా యలను మార్కెట్ యార్డ్ ద్వారా రైతుల దగ్గర నుండి మామిడికాయలను సేకరించి ఆ ఉత్పత్తులను గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేయుటకు హామీ ఇవ్వడం జరిగిందని అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు.

## భక్తి శ్రద్ధలతో సంకట హర చతుర్థి పూజలు



**వేంపల్లె - సూర్య వాస్తవం:** శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం సంకట హర చతుర్థి పురస్కరించుకుని ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో విఘ్నేశ్వరుడికి సంకట హర చతుర్థి పూజలు నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్,మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. ఉదయం వాసవి మాతకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి ఆలయంలో లలితా సహస్ర నామావలి, అష్టోత్రాలు పఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ నిర్వాహకుడు మిట్టామోహన్ రావు, ఆర్యవైశ్య సంఘం,ఆర్యవైశ్య యువజన సంఘం,శ్రీ వాసవి కళ్యాణ మండపం,మహిళా మండలి,తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నైపుణ్యానికి తోడైన సేవా హస్తం

### - ప్రత్యేక ప్రతిభ కలిగిన బాలికకు కుట్టు యంత్రం బహుకరణ



### స్వయం ఉపాధి దిశగా అడుగులు... చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ సేవలకు ప్రశంసలు

**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** సమాజంలోని అణగారిన వర్గాలకు చేయూతనిస్తూ సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ మరో సత్కార్యాన్ని చేపట్టింది. నైపుణ్యం ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో ముందుకు సాగలేని ప్రత్యేక ప్రతిభ కలిగిన ఒక బాలికకు స్వయం ఉపాధి కోసం కుట్టు యంత్రాన్ని అందజేసి ఆమె భవిష్యత్తుకు వెలుగులు నింపింది. తిరుపతి జిల్లా పెళ్లకూరు కేంద్రంగా ప్రజా సంక్షేమం కోసం స్థాపించబడిన ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, ట్రస్ట్ నిర్వహణ ట్రస్టీ శ్రీ చాగణం గౌరీశంకర్ స్వయంగా ఆ బాలికకు కుట్టు యంత్రాన్ని బహుకరించారు. టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న ఆమెకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేని యువతకు చేయూత అందించడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక ప్రతిభ కలిగిన యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారు స్వయం ఉపాధితో గౌరవప్రదమైన జీవితం గడపడానికి సహకరించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.కుట్టు యంత్రం అందుకున్న బాలిక మరియు ఆమె కుటుంబ సభ్యులు ట్రస్ట్ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం వల్ల ఆమె తన నైపుణ్యాన్ని ఉపయోగించి స్వయం ఉపాధితో జీవనం సాగించగలదని ఆనందం వ్యక్తం చేశారు.

సమాజ సేవలో భాగంగా చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఇప్పటికే ఉచిత వైద్య శిబిరాలు, తాగునీటి సరఫరా, విద్యా సహాయం, ఉపాధి శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మనసులు గెలుచుకుంటోంది. తాజా కార్యక్రమం కూడా ఆ సేవా భావానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## అమరావతి అసలు ఛాలెంజ్ మొదలు

**విజయవాడ - సూర్య వాస్తవం:**

అమరావతి రాజధాని అంశంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తీసుకు వచ్చాయి. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో ఈ రాజధానికి చట్టబద్ధత లభించిందనే భావన బలపడింది. దీంతో ఇప్పటివరకు ఉన్న అనుమానాలు, సందేహాలు చాలా వరకు తొలగిపోయాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన ట్లు అమరావతిని ఇక ఎవ్వరూ మార్చ లేరనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ నిర్ణయాన్ని మార్చడం సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇప్పటి నుంచి అసలు సవాలు అభివృద్ధి దిశగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం మీద భారీ బాధ్యత ఉంది. అమరావతి కోసం ఇప్పటికే వేలాది ఎకరాలు సేకరించబడ్డాయి. ఇప్పుడు ఆ భూముల్లో ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు చేపట్టాలి. ప్రభుత్వ పరంగా సచివాలయం , అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు నివాస సముదాయాలు నిర్మించాల్సి ఉంది.

### కేపీ. ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు

## ఉచిత కుట్టుశిక్షణా కేంద్రం ప్రారంభం

### దివ్యాంగులకు చేతివృత్తులలో శిక్షణ - వారి భావిజీవితానికి సరైన రక్షణ

### కే పి. ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ కోలాప్రసాద్





**పులివెందుల - సూర్య వాస్తవం:** అంగవైకల్యంతో బాధపడుతూ, తీవ్ర నిరాశా,నిస్పృహలలో ఉన్న దివ్యాంగులకు చేతివృత్తులలో శిక్షణనిచ్చి, వారికి సరైన జీవనోపాధి కల్పిస్తే, వారు స్వతంత్రంగా జీవించి, పదిమందికి స్ఫూర్తి ప్రదాతలుగా మారతారని, దివ్యాంగులు ఎప్పుడూ అశక్తులు కాదని అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, ఏసుప్రభువు పునరుద్ధానం చెందిన ఈస్టర్ పర్వదినం రోజు దేవుని బిడ్డలైన దివ్యాంగులకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమని, ఆరునెలల పాటు జరిగే ఈకుట్టుశిక్షణకు పులివెందుల నియోజకవర్గంలోని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకొని, జీవనోపాధి పొందాలనేదే తమ కేపీ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని దళిత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కోలా ప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని కేపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సంస్థ చైర్మన్ డాక్టర్ కోలా ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం విశ్వమాత మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం దివ్యాంగుల కుట్టుశిక్షణను పరిశీలిశీచి, టైలరింగ్ ట్రైనింగ్ టీచర్ ద్వారా శిక్షణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు. తదనంతరం పాస్టర్స్ అసోసియేషన్ మరియు దివ్యాంగుల నెట్వర్క్ సభ్యులు కోలా ప్రసాద్ ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారులి. అనంతరం కోలా ప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులకు నిత్యావసర సరుకులను, ఇతరు ఉచితాలను ఇవ్వడం కన్నా, వారిలో ఉన్న అంతర్గత నైపుణ్యాన్ని వెలికి తీసే ఇటువంటి చేతివృత్తుల శిక్షణా కార్యక్రమాలు వారి కాళ్లపై వారు నిలబడి, ఒకరిపై ఆధారపడకుండా, స్వతంత్రంగా జీవించేందుకు అవకాశాలు కల్పిస్తాయని, అందుకే ఉపాధి అవకాశాల దిశగా, తమ సంస్థ ద్వారా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నానని, ఆరు నెలల శిక్షణ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన దివ్యాంగులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లతో పాటు, అధునాతన ఎలక్ట్రిక్ కుట్టుమిషన్లను కూడా తానే ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారు. కోలా ప్రసాద్ సేవా స్ఫూర్తిని పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ప్రశంసించారు.ఈకార్యక్రమంలో కేపి. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోలా ప్రసాద్, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, డేవిడ్, కృపారాజ్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రహ్మంగారిమఠంలో

## బస్ షెల్టర్ నిర్మాణానికి నాంది

### - ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సొంత నిధులతో

### -తాత్కాలికి బస్సు షెల్టర్

**బ్రహ్మంగారిమఠం సూర్య వాస్తవం:**



ఎంతో కాలంగా బ్రహ్మంగారి మఠం మండల ప్రజలు,యాత్రికులు ఎదురుచూస్తున్న బస్ షెల్టర్ నిర్మాణానికి నాంది పడింది స్థానికులు బ్రహ్మంగారి మఠానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు బ్రహ్మంగారిమఠంలో నిలువ నీడ లేక ఎంతగానో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులను మండల ప్రజానీకం స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లడంతో గతంలో ఐదు రోడ్ల కూడలి నందు బస్టాండ్ ఉన్న ప్రదేశం లోనే తాత్కాలిక బస్ షెల్టర్ నిర్మాణానికి ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు వేసవి తీవ్రతను మరియు బ్రహ్మంగారి మఠం ఆరాధన గురుపూజ మహోత్సవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారనే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతానికి గతంలో బస్సు షెల్టర్ ను తొలగించిన ప్రదేశంలోనే నిర్మాణానికి పూనుకున్నారు దీనిపైన స్థానిక ప్రజలు వీరబ్రహ్మేంద్రస్వామి వారి భక్తులు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలో బస్సు షెల్టర్ లేక ప్రజలు భక్తులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో తమ ప్రియతమ నాయకుడు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సొంత నిధులతో ప్రస్తుతానికి తాత్కాలిక బస్ షెల్టర్ నిర్మాణాన్ని చేపట్టామని ప్రసాదం స్కీం నిధులు విడుదల కాగానే శాశ్విత బస్టాండు నిర్మాణానికి తమ నాయకుడు కట్టుబడి ఉన్నారని వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు పూజా శివయ్య యాదవ్, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ , మేకల సుధాకర్ యాదవ్ ,నాగయ్య యాదవ్, స్థానిక ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## డేంజర్ లో డ్యామ్

**కర్నూలు - సూర్య వాస్తవం:**శ్రీశైలం డ్యామ్‌ను సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (సీడీఎస్ఏ) టీమ్ పరిశీలించింది. శ్రీశైలం జలాశయం వ్యూ పాయింట్ వద్ద అధికారులతో సమావేశం నిర్వహించారు. శ్రీశైలం డ్యామ్ గ్యాలరీ, క్రస్ట్ గేట్లను, ప్లంజిపూల్ పరిశీలించారు. ప్లంజ్‌పూల్‌తో ఆనకట్టకు నష్టం లేదని సీడీఎస్ఏ ఛైర్మన్ డీకే శర్మ తెలిపారు. ఎలాంటి అత్యవసరమైన చర్యలు అవసరం లేదని నిపుణుల టీమ్ తమకు తెలిపినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.శ్రీశైలం జలాశయానికి ప్లంజ్‌పూల్‌తో ఎలాంటి నష్టం లేదని సీడీఎస్ఏ (సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఛైర్మన్ డీకే శర్మ తెలిపారు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందు జాగ్రత్తగా రెండు వైపులా గోడలు నిర్మించాలని సూచించారు. చిన్నచిన్న మరమ్మతులు చేసుకుంటూ ప్లంజ్‌పూల్ పనులు చేసుకోవచ్చని సూచించారు. ఢిల్లీ నుంచి వచ్చిన డీకే శర్మ నేతృత్వంలోని సీడీఎస్ఏ టీమ్ శ్రీశైలం జలాశయాన్ని, గ్యాలరీ, క్రస్ట్‌గేట్లను పరిశీలించింది.. మార్పు, చేర్పులతో పాటుగా మరమ్మతులపై ఇరిగేషన్ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఏపీ ప్రభుత్వానికి ప్రస్తుతం జలాశయం దగ్గర జరుగుతున్న పనులపై నివేదిక అందజేస్తామన్నారు.శ్రీశైలం డ్యామ్ దగ్గర ఏడేళ్ల కాలంలో ప్లంజ్‌పూల్‌లో లోతు పెరగలేదని జల వనరులశాఖ చీఫ్ ఇంజినీరు కబీర్ బాషా తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన టీమ్ జలాశయం దగ్గర ప్రస్తుతానికి ఎలాంటి అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం డ్యామ్ దగ్గర అప్రోచ్ రోడ్డు, షార్ట్ క్రీటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనుల కోసం ప్రభుత్వం మొత్తం రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు.

## ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

### - ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో కార్యక్రమం

### - ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద నివాళులు

### - అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో కొత్త విగ్రహానికి శంకుస్థాపన

**నాయుడుపేట - సూర్య వాస్తవం:**

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో భారత మాజీ ఉప ప్రధాని, బడుగుల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో పాటు పలువురు నాయకులు బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాయుడుపేటలోని అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో బాబు జగజ్జీవన్ రామ్ నూతన విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ నాయుడుపేట ప్రజల కోరిక మేరకు అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో బాబు జగజ్జీవన్ రామ్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం జగజ్జీవన్ రామ్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం




నెలకొల్పడంలో ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ రఫీ, పార్టీ నాయకులు పార్థసారథి, కట్టా వెంకటరమణారెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, చిట్టేటి చెంచయ్య, నానబాల సుబ్బారావు, పోట్లపూడి రాజేష్, పలుకూరు ముత్యాలయ్య, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, అరిగొండ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రలయానికి మంచి రోజులు

**కర్నూలు- సూర్య వాస్తవం:** కర్నూలు జిల్లా మంత్రాలయానికి బైపాస్ రోడ్డుకు సంబంధించి తొలి అడుగు పడింది. కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.59 కోట్లతో మంత్రాలయానికి బైపాస్‌ను రెండు లైన్లుగా నిర్మిస్తున్నారు. ఈ బైపాస్ అందుబాటులోకి వస్తే మంత్రాలయానికి ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే. నిత్యం మంత్రాలయానికి భక్తులు తరలివస్తుంటారు.. ఈ క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రభుత్వం బైపాస్ రోడ్డు కోసం నిధులు విడుదల చేసింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా హైవేలు, స్టేట్ హైవేలతో పాటుగా అవసరమైన చోట్ల రోడ్లను విస్తరిస్తున్నారు. అలాగే కొన్ని నగరాలకు, పట్టణాలకు బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. రాయలసీమలో కూడా రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇటీవల మంత్రాలయం బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదలైన సంగతి తెలిసిందే. అయితే తాజాగా మంత్రాలయం బైపాస్ నిర్మాణానికి తొలి అడుగు పడింది. మంత్రాలయం బైపాస్‌కు శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు స్థానిక నేతలతో కలిసి భూమిపూజ నిర్వహించారు. రూ.59 కోట్లతో నిర్మించే ఈ రెండు లైన్ల బైపాస్ నిర్మాణం పూర్తయితే మంత్రాలయానికి ట్రాఫిక్ చిక్కులు తొలగిపోతాయంటున్నారు. కర్నూలు జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి కొలువై ఉన్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి నిత్యం దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, సినీ, రాజకీయ, వ్యాపారంగాల నుంచి ప్రముఖులు వస్తుంటారు. వీరితో పాటుగా నిత్యం భక్తులు మంత్రాలయం వస్తుండటంతో వాహనాల రద్దీ కూడా పెరిగింది. మంత్రాలయం వచ్చే భక్తులకు తోడు స్థానికుల వాహనాలతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

# శర్వా అంటే ఏంటో.. అభిలాష్ చూపించాడు!



టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ లేటెస్ట్ మూవీ బైకర్.. ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ బ్యాక్ డ్రాప్ తో రూపొందిన చిత్రంగా ఆ మూవీపై రిలీజ్ కు ముందే ఆసక్తి నెలకొంది. ఇప్పుడు విడుదల తర్వాత కూడా సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో థియేటర్లలో సందడి కనిపిస్తోంది. గుడ్ ఫ్రైడే కానుకగా ఏప్రిల్ 3న విడుదలైన బైకర్ ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. కథ, యాక్షన్ సీన్స్, రేసింగ్ ఎపిసోడ్స్ కు మార్కులు పడుతున్నాయి. ముఖ్యంగా శర్వానంద్ నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విజయంతో శర్వానంద్ భావోద్వేగానికి లోనయ్యారు. హైదరాబాద్ లోని శ్రీరాములు థియేటర్ లో తాజాగా అభిమానులతో కలిసి సినిమా చూసిన ఆయన, అక్కడే ఉన్న తెరకు సాష్టాంగ నమస్కారం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. తెరను ముట్టుకుని ముద్దు పెట్టుకున్న శర్వానంద్ కాసేపు భావోద్వేగంతో కనిపించారు. ఆ మూమెంట్స్ చూసిన అభిమానులు కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ, తాను చేసిన సినిమాల్లో కొన్ని ప్రేక్షకులకు నచ్చాయని, మరికొన్ని నచ్చలేదని తెలిపారు. కానీ బైకర్ సినిమా తనకు ఎంతో ప్రత్యేకమని చెప్పారు. దర్శకుడు అభిలాష్ రెడ్డి తనను మళ్లీ నిలబెట్టారని అన్నారు. దర్శకుడు హీరోను ఎంతగా ప్రేమిస్తే, ఆ ప్రేమ సినిమాల్లో ఎలా కనిపిస్తుందో ఈ చిత్రంతో నిరూపించారని కొనియాడారు. "మంచి సినిమాలు చేశా.. కొన్ని మీకు నచ్చినవి చేశా.. మరికొన్ని నచ్చనవి చేశా.. కానీ అభిలాష్ నన్ను మళ్లీ తీసుకొచ్చి నిల్చుబెట్టి శర్వా ఏంటో.. డైరెక్టర్ హీరోను ప్రేమిస్తే ఏంటో.. నా తమ్ముడు, బంగారం, ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అభిలాష్ చూపించాడు" అంటూ డైరెక్టర్ పై ప్రశంసలు కురిపించారు. "ఇది నా సినిమా.. నా దేవత. నాకు కలలు ఇచ్చిన తల్లిలాంటి థియేటర్ కు నమస్కరిస్తున్నా" అంటూ శర్వా భావోద్వేగంతో మాట్లాడారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోను అభిమానులు పెద్దఎత్తున షేర్ చేస్తూ, సినిమాపై ఆయనకు ఉన్న ప్రేమకు అభినందనలు తెలుపుతున్నారు. అయితే బైకర్ సినిమాలో శర్వానంద్ బైక్ రేసర్ గా కనిపించగా, ఆయనకు జోడీగా మాళవిక నాయర్ నటించారు. అలాగే సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో, హీరోకు తండ్రిగా కనిపించారు. వీరి ముగ్గురి పాత్రలు కూడా కథకు బలం చేకూర్చాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. బైకర్ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మాతలు ప్రమోద్, వంశీ నిర్మించారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కిన సినిమా విజువల్ పరంగా కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా రేసింగ్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఏదేమైనా బైకర్ శర్వానంద్ కెరీర్ లో మరో హిట్ గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాజిటివ్ టాక్ కొనసాగితే, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం శర్వానంద్ ఎమోషనల్ వీడియో, ఆయన కామెంట్స్ నెట్టింట ట్రెండింగ్ లో నిలిచాయి.

# ప్రభాస్ మళ్లీ షారుక్ ఖాన్‌తో ఢీ అంటాడా?



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మరోసారి భారీ బాక్సాఫీస్ పోరుకు రంగం సిద్ధమయ్యే అవకాశం ఉందా?అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. గ్లోబల్ స్టార్ ప్రభాస్ - బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ మరోసారి థియేటర్ల వద్ద తలపడే అవకాశం ఉందన్నది ప్రాథమిక సమాచారం. గతంలో ఇద్దరు హీరోలు నటించిన -సలార్- డంకీ- చిత్రాల మధ్య జరిగిన హోరాహోరీ పోరును తలపించేలా? ఈసారి -ఫౌజీ- - -కింగ్- చిత్రాల మధ్య క్లాష్ ఉంటుందా? అన్న సందేహాలు బలపడుతున్నాయి.ప్రస్తుతం షారుక్ ఖాన్ నటిస్తోన్న క్రేజీ యాక్షన్ ఎంటర్టైనర్ -కింగ్- చిత్రాన్ని డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు. అధికారికంగా రిలీజ్ ను కూడా ప్రకటించారు.

ఈ సినిమాతో షారుక్ కుమార్తె సుహానా ఖాన్ వెండి తెరకు పరిచయం అవుతుంది. దీంతో షారుక్ కింగ్ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు ప్రభాస్ - హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న పీరియాడిక్ డ్రామా -ఫౌజీ- షూటింగ్ దశలో ఉంది.

ఈ సినిమాను ముందుగా ఆగస్టు లో రిలీజ్ చేయాలనుకున్నారు. ఇప్పటికే అదే తేదీకి యూనిట్ కట్టుబడి ఉంది. కానీ చిత్రం అప్పటికీ పూర్తికాకపోతే గనుక దసరా కానుకగా అక్టోబర్‌లో విడుదల చేయాలని ప్లాన్ బీని కూడా సిద్ధం చేసి పెట్టుకున్నారు. వైరలవుతున్న డైరెక్టర్ కామెంట్స్ అయితే భారీ విజువల్ ఎఫెక్ట్స్ , నిర్మాణ విలువల కారణంగా షూటింగ్ ఆలస్యమైతే ప్లాన్ సీ ని అమలు చేయాలని చూస్తున్నారు. అక్టోంబర్ నుంచి డిసెంబర్ నెలకు వాయిదా వేసే అవకాశం ఉందని ఇండస్ట్రీ టాక్. నిజంగా -ఫౌజీ- అక్టోబర్ నుండి డిసెంబర్‌కు మారితే షారుక్ -కింగ్- సినిమాకు గట్టి పోటీ తప్పదు. ఫౌజీని కూడా క్రిస్స్ కానుకగానే రిలీజ్ చేస్తారు. గత ఏడాది క్రిస్మస్ సమయంలో -సలార్- - -డంకీ- మధ్య ఎలాంటి పోటీ నెలకొందో తెలిసిందే. -సలార్- డిసెంబర్ 22న రిలీజ్ అయితే ఆ ముందు రోజే అంటే డిసెంబర్ 21న రిలీజ్ అయింది. కానీ ఈ పోటీలో ప్రభాస్ భారీ వసూళ్లతో పైచేయి సాధించారు.

తాజాగా మళ్ళీ అదే పండుగ సీజన్‌లో ఇద్దరు సూపర్ స్టార్స్ తలపడితే? బాక్సాఫీస్ వద్ద వార్ తప్పదు. ముఖ్యంగా తెలుగు, హిందీ మార్కెట్లలో థియేటర్ల కేటాయింపు విషయంలో పెద్ద యుద్ధమే జరగొచ్చు.

సింగిల్ లాంగ్వేజ్ అంటూ -ధురంధర్- విసిరిన సవాల్ ను టాలీవుడ్ నుంచి ప్రభాస్ తీసుకునే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. షారుక్ కూడా తక్కువేం కాదు. ప్రభాస్ పై అప్పర్ హ్యాండ్ తనదే అవ్వడం కోసం చేయాల్సిన ప్రయత్నాల్ని చేస్తాడు. అందులో ఎలాంటి సందేహం లేదు.





# దంచికొట్టిన బెంగళూరు

**- చెన్నైకు హాట్రిక్ ఓటమి**

**బెంగళూరు :** ఐపిఎల్ 2026లో భాగంగా ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్(సిఎస్‌కె)తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) దంచికొట్టింది. ట్యాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సిబిలో బ్యాటర్లు సిఎస్‌కె బౌలర్లకు చుక్కలు చూపించారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి ఆర్‌సిబి 250 పరుగులు భారీ స్కోరు చేసింది. ఆర్‌సిబిలో విరాట్ కోహ్లి (28 పరుగులు, 18 బంతుల్లో సిక్స్, రెండు ఫోర్లు) త్వరగా నాలుగో ఓవర్‌లో నిష్క్రమించినా, తరువాత ఫిల్‌సాల్ట్ (46, 30 బంతుల్లో రెండు సిక్స్‌లు, మూడు ఫోర్లు), దేవ్‌దత్ పడిక్కల్ (50, 29 బంతుల్లో రెండు సిక్స్‌లు, 5 ఫోర్లు) దాటిగా ఆడింది. 11వ ఓవర్‌లో ఫిల్‌సాల్ట్ అవుట్‌తో పడిక్కల్‌కు కెప్టెన్ రజత్ పాటిదార్ (48, 19 బంతుల్లో ఒక ఫోరు,ఆరు సిక్స్‌లు) జతకలిశాడు. 15వ ఓవర్‌లో పడిక్కల్ అవుట్‌తో టిమ్ డేవిడ్ (70 పరుగులు, 25 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్స్‌లు) రంగ ప్రవేశంతో ఆర్‌సిబి ఇన్నింగ్స్ టాప్ గేర్‌లోకి మారింది. రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్ జోడీ సిక్స్‌లతో చెన్నై బౌలర్లపై విరుచుకుపండింది. ఈ జోడీ చివరి ఐదు ఓవర్లలో అజేయంగా 97 పరుగులు సాధించింది. 251 పరుగులు భారీ లక్ష్యంతో ఇన్నింగ్స్ ఆరంభించిన సిఎస్‌కెలో ఓపెనర్లు సంజు శాంసన్ (9), రుజురాజ్ గైక్వాడ్ (7) నిరాశపర్చారు. జట్టులో మిగిలిన బ్యాటర్లది ఆదే బాట. సర్ఫాజ్ ఖాన్ (50, 25 బంతుల్లో రెండు సిక్స్‌లు, 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. దీంతో సిఎస్‌కె 19.4 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటయింది. ఆర్‌సిబి 43 పరుగులతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో ఆర్‌సిబి పాయింట్ల పట్టికలో టాప్‌లోకి చేరింది. చెన్నైకు ఇది వరసగా మూడో విజయం. ఈ మ్యాచ్‌లో ఆర్‌సిబి బౌలర్ భువనేశ్వర్ కుమార్ అరుదైన ఘనత సాధించాడు. ఐపిఎల్‌లో 200 వికెట్లు సాధించిన రెండో బౌలర్‌గా, మొదటి ఫాస్ట్ బౌలర్‌గా నిలిచాడు. 1.2వ ఓవర్లో ఆయుష్ మాత్రేను ఔట్ చేసి భువనేశ్వర్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. అంతకు ముందు యజువేంద్ర చాహల్ ఈ ఘనత సాధించాడు. ఆదివారం మ్యాచ్‌లో భువనేశ్వర్ మొత్తంగా మూడు వికెట్ల సాధించాడు.

# షమి సూపర్ షో

**- ఛేదనలో రిషబ్ పంత్ అజేయ అర్ధ సెంచరీ**
**- 5 వికెట్ల తేడాతో సూపర్‌జెయింట్స్ గెలుపు**
**- స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో సన్‌రైజర్స్‌కు నిరాశే**



**హైదరాబాద్ :** రిషబ్ పంత్ (68 నాటౌట్, 50 బంతుల్లో 9 ఫోర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో సహచర బ్యాటర్లు నిరాశపరచగా.. జోరుమీదున్న సన్‌రైజర్స్ బౌలర్ల ఉత్సాహంపై పంత్ నీళ్లు చల్లాడు. అనవసర దూకుడుకు వెళ్లకుండా, లక్నో సూపర్‌జెయింట్స్‌ను లక్ష్యానికి చేరువ చేశాడు. 157 పరుగుల లక్ష్యాన్ని సూపర్‌జెయింట్స్ 5 వికెట్లు కోల్పోయి 19.5 ఓవర్లలో ఛేదించింది. సూపం జెయింట్స్ ఓపెనర్ ఎడెన్ మార్‌క్రామ్ (45, 27 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (62, 41 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్ కుమార్ రెడ్డి (56, 33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. అభిషేక్ శర్మ (0), ట్రావిశ్ హెడ్ (7), ఇషాన్ కిషన్ (1), లివింగ్‌స్టోన్, అనికెత్ వర్మ (2) నిరాశపరిచారు. సూపర్‌జెయింట్స్ పేసర్ మహ్మద్ షమి (2/9) నిప్పులు చెరిగే బంతులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుకు ముకుతాడు వేశాడు.

పంత్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ : లక్ష్యం 157 పరుగులు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. దీంతో సూపర్‌జెయింట్స్ గెలుపు నల్లేరు మీద నడకే అనుకున్నారు. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రామ్ (45, 27 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) పవర్‌ప్లేలో మెరవటంతో సన్‌రైజర్స్ శిబిరం డీలా పడింది. మిచెల్ మార్ష్ (14), మార్‌క్రామ్, ఆయుశ్ బదొని (12), నికోలస్ పూరన్ (1) వికెట్లతో పుంజుకున్న సన్‌రైజర్స్.. సూపర్‌జెయింట్స్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. ఈ సమయంలో కెప్టెన్ రిషబ్ పంత్ (68 నాటౌట్) ఓ ఎండ్‌లో నిలబడ్డాడు. ఆచితూచి ఆడిన పంత్..6 ఫోర్లతో 43 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. సాధించాల్సిన రన్‌రేట్ పెద్దగా లేకపోవటంతో పంత్ రిస్క్ తీసుకోలేదు. ఒక్కో పరుగు జోడిస్తూ సూపర్‌జెయింట్స్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. అబ్దుల్ సమద్ (16, 12 బంతుల్లో 2 ఫోర్లు) నిష్క్రమణతో ముకుల్ చౌదరి (2 నాటౌట్) స్ట్రయిక్ రొటేట్ చేసేందుకు ఇబ్బంది పడ్డాడు. ఆఖరు ఓవర్లో 9 పరుగులు అవసరం కాగా.. పంత్ మూడు బౌండరీలతో లాంఛనం ముగించాడు. 19.5 ఓవర్లలో 5 వికెట్లకు సూపర్‌జెయింట్స్ 160 పరుగులు చేసింది. ఒక్క బంతి ఉండగానే సన్‌రైజర్స్‌పై గెలుపొందింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో హర్ష్ దూబె (2/18), ఈషన్ మలింగ (1/30), శివాంగ్ కుమార్ (1/30) రాణించారు.

టాప్-4 విఫలం : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను లక్నో పేసర్ మహ్మద్ షమి (2/9) కోలుకోలేని దెబ్బతీశాడు. అవుట్‌సైడ్ లెగ్ లెంగ్త్‌తో బంతులేసిన షమి.. తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ (0)ను అవుట్ చేశాడు. ట్రావిశ్ హెడ్ (7)ను తర్వాతి ఓవర్లో సాగనంపాడు. ప్రిన్స్ యాదవ్ అద్భుత బంతికి ఇషాన్ కిషన్ (1) వికెట్ కోల్పోయాడు. దీంతో 3.3 ఓవర్లలో 11 పరుగులకే సన్‌రైజర్స్ టాప్-3 వికెట్లు కోల్పోయింది. ఓ సిక్సర్‌తో ఆశలు రేపిన లియాం లివింగ్‌స్టోన్ (14) స్వీప్ షాట్‌కు ప్రయత్నించి పంత్ చేతికి చిక్కాడు. 26/4తో సన్‌రైజర్స్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. పవర్‌ప్లేలో 22 పరుగులే చేసిన సన్‌రైజర్స్.. ఇన్నింగ్స్ 11వ ఓవర్లో 50 పరుగుల మార్క్ దాటింది. ఈ పరిస్థితుల్లో ఎస్‌ఆర్‌హెచ్ వంద పరుగులు చేసినా గొప్పే అనిపించింది. 20 ఓవర్లలో 9 ఓవర్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ 156 పరుగులు చేసింది. పవర్‌ప్లేలో అద్భుత బౌలింగ్ ప్రదర్శన కనబరిచిన మహ్మద్ షమి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా

## శీతల పానీయాలు అనర్థదాయకం

# కూల్ డ్రింక్స్ ఆరోగ్యానికి హానికరం

ప్రత్యేక కథనం

**డా . యం. అఖిల మిత్ర, ప్రకృతి వైద్యులు**



వేసవి వచ్చిందంటే అన్ని అనర్థాలను దరిద్రాలు ప్రజలు ఆహ్వానిస్తున్నారు. ప్రజలకు ఎందుకూ పనికిరాని ఐపీఎల్ ప్రసారాలు ఒకవైపు పోరింగ్ పాట్నర్ పేరుతో శీతలపానీయాల అడ్వర్టైజ్మెంట్ మరోవైపు. ప్రజలు కూల్ డ్రింక్ షాపుల వైపు పరుగెడతారు. ప్రతి ఇంట్లో రిఫ్రిజిరేటర్ లో కూల్ డ్రింక్ బాటిల్స్ నిండి ఉంటాయి. చాలామంది ప్రతి వారం షాపింగ్ మాల్స్ కు వెళ్లి కార్టూన్ కొద్దీ శీతలపానీయాలు కొని కరువా కాలమా అన్నట్లు కార్ట్ ను బలవంతంగా తోసుకువస్తుంటారు. వాస్తవానికి కూల్ డ్రింక్స్ చల్లదనాన్ని ఇవ్వవు. ఇవ్వకపోగా మనిషి ఆరోగ్యాన్ని పాడు చేస్తాయని అనేక పరిశోధనలలో తేలింది. మన శరీరంలో జరిగే మార్పులు గ్రహించకుండా ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క రకమైన అలవాట్లను మనిషి నేర్చుకున్నాడు. ముఖ్యంగా ఈ ప్రాశ్చ్యాత్త ఫ్యాషన్ నాగరికతలో భాగంగా కూల్డ్రింకులను బాగా అలవాటు పడ్డారు. కూల్డ్రింక్స్ లో ఎక్కువ శాతం పురుగుల మందుల అవశేషాలు పుష్కలంగా ఉన్నట్లు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్ మెంటల్ ఇండియా దశాబ్దం క్రితం తేల్చి చెప్పింది. మానవ శరీరాలను ప్రమాదకరంగా మారే పదార్థాలు కూల్ డ్రింక్ లో ఉండే పదార్థాలు కార్బోనేటెడ్ వాటర్, కార్న్ సిరప్, పంచదార, ఎస్పిరటం, కారమెల్,పాస్పరిక్ ఆమ్లం, కెఫిన్, సిట్రిక్ ఆమ్లం, పొటాషియం బెంజైట్,పొటాషియం సిట్రేట్ ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. కూల్ డ్రింక్ లో ఉండే ఆర్గానో క్లోరిన్, ఆర్గానో ఫాస్ఫరస్ పురుగుల మందులైన లిండేన్,డిడిటి, మలాథియాన్ ఉన్నట్లు పరిశోధనలు చెపుతున్న ప్రభుత్వాలు వీటిని బ్యాన్ చేయడం లేదు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కూల్ డ్రింక్ కంపెనీలు ఏటా ఏడు వేల కోట్లు దోచుకుంటున్నాయి. ప్రజల డబ్బుతో హీరోగా, క్రీడాకారులుగా, అవార్డు గ్రహీతలు పెద్దమనుషులు గా చలామణి అవుతున్న వారు కోట్లల్లో డబ్బు తీసుకుని ప్రజా ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసే వాణిజ్య ప్రకటనలు ఇస్తున్నారు. వారిపై క్రిమినల్ కేసులు బనాయించాల్సిన ప్రభుత్వం వీరిని అవార్డులతో సత్కరించడం సిగ్గుచేటు. కూల్డ్రింకులు పీహెచ్ శాతం టాయిలెట్ క్లినర్స్ యాసిడ్తో సమానంగా ఉంటుంది ఇది శరీరానికి చాలా ప్రమాదకరం. స్థూలకాయం, ఊపిరి తిత్తులు, బి. పి, షుగర్, ఎముకల మెత్తబడి పోవడం, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి. జీర్ణ వ్యవస్థను ధ్వంసం చేసి, రీనల్ ఫైల్యూర్ కు దారి తీస్తుంది. గర్భిణీ స్త్రీలు కూల్డ్రింకులు సేవిస్తే పుట్టబోయే పిల్లలు - పిండం పై ప్రభావం ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు, కిడ్నీ, లివర్, క్యాన్సర్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. తరచుగా అధిక మొత్తంలో చక్కెరతో కూడిన శీతల పానీయాలు మన దైనందిన జీవితంలో పాతుకుపోయాయి, వాస్తవానికి మద్యపానం, సిగరెట్, గుట్కా వంటి పదార్థాల మాదిరిగా వ్యసనానికి

**కూల్డ్రింక్స్ లో ఎక్కువ శాతం పురుగుల మందుల అవశేషాలు పుష్కలంగా ఉన్నట్లు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్ మెంటల్ ఇండియా దశాబ్దం క్రితం తేల్చి చెప్పింది. మానవ శరీరాలను ప్రమాదకరంగా మారే పదార్థాలు కూల్ డ్రింక్ లో ఉండే పదార్థాలు కార్బోనేటెడ్ వాటర్, కార్న్ సిరప్, పంచదార, ఎస్పిరటం, కారమెల్,పాస్పరిక్ ఆమ్లం, కెఫిన్, సిట్రిక్ ఆమ్లం, పొటాషియం బెంజైట్,పొటాషియం సిట్రేట్ ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి.**

దారితీస్తాయి. ఒక్క శీతల పానీయం బాటిల్లో ఎంత చక్కెర ఉందో అర్థం చేసుకోవడం కళ్లు తెరిపిస్తుంది. కొన్ని శీతల పానీయాలు చక్కెర స్థాయిలను కలిగి ఉంటాయి, ఇది రోజువారీ సిఫార్సు చేయబడిన తీసుకోవడం స్థాయిలను మించిపోయింది. అధిక చక్కెర తీసుకోవడం ఊబకాయం, మధుమేహం మరియు దంత సమస్యలతో సహా వివిధ ఆరోగ్య సమస్యలకు దోహదం చేస్తుంది. అంతేకాకుండా, శీతల పానీయాల యొక్క ప్రతికూల ప్రభావం చక్కెర కంటెంట్కు మించి ఉంటుంది. శీతల పానీయాలలో టాయిలెట్ క్లీనర్లు తో సమానంగా ఆమ్ల లక్షణాలు ఉంటుంది. దంతాలు జీర్ణ ఆరోగ్యం పై వాటి ప్రభావాన్ని చూపుతాయి . ఆమ్ల పానీయాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల పంటి ఎనామిల్ చెరిపి చేయబడుతుంది, జీర్ణశయాంతర అసౌకర్యానికి దారితీస్తుంది. శీతల పానీయాలు అనేక ఆరోగ్య సమస్యలు ముడిపడి ఉన్నాయి, శీతల పానీయాల వినియోగం దీర్ఘకాలంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. శీతల పానీయాలు తరచుగా కేలరీలు, చక్కెరలో ఎక్కువగా ఉంటాయి, బరువు పెరగడానికి, ఊబకాయానికి దోహదం చేస్తాయి, శీతల పానీయాలలో అధిక చక్కెర కంటెంట్ ఇన్సులిన్




నిరోధకత కు దారితీస్తుంది అలాగే టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది, చక్కెర శీతల పానీయాల అధిక వినియోగం రక్తంలో చక్కెర స్థాయిలు మరియు హృదయనాళ ఆరోగ్యంపై వాటి ప్రభావం కారణంగా రక్తపోటు, కొరోనరీ ఆర్టరీ వ్యాధి స్ట్రోక్తో సహా గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది.

శీతల పానీయాలలో ఉండే ఆమ్లత్వం కృత్రిమ సంకలనాలు కడుపు లైనింగ్ను చికాకుపరుస్తాయి, ఇది యాసిడ్ రిఫ్లక్స్, అజీర్ణం జీర్ణశయాంతర అసౌకర్యం వంటి జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కొన్ని అధ్యయనాలు ఆహార శీతల పానీయాలలో కనిపించే కొన్ని కృత్రిమ స్వీట్నర్లు వినియోగం క్యాన్సర్ వచ్చే ప్రమాదం మధ్య సంభావ్య సంబంధాన్ని సూచించాయి, శీతల పానీయాల రెగ్యులర్ వినియోగం, ముఖ్యంగా ఫ్రక్టోజ్ అధికంగా ఉండేవి, కాలక్రమేణా కొవ్వు కాలేయ వ్యాధి మరియు కాలేయం దెబ్బతినడానికి దోహదం చేస్తాయి. శీతల పానీయాలలో అధిక స్థాయి చక్కెర మరియు కెఫిన్ పురుషులు మరియు స్త్రీలలో పునరుత్పత్తి ఆరోగ్యం, సంతానోత్పత్తిని ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చు. సాఫ్ట్ డ్రింక్స్లో ఫాస్పోరిక్ యాసిడ్ ఉంటుంది, ఇది కాల్షియం శోషణకు ఆటంకం కలిగిస్తుంది మరియు ఎముక సాంద్రత నష్టానికి దోహదం చేస్తుంది, ముఖ్యంగా పిల్లలు మరియు పెద్దలలో బోలు ఎముకల వ్యాధి, పగుళ్ల ప్రమాదాన్ని పెంచుతుంది. ప్రజలు వేసవిలో మజ్జిగ, లస్సి, పండ్ల రసాలు, రాగి జావ, తాటి ముంజలు, కర్బుజా, కళింగర, కీర దోస పిల్లలకు అలవాటు చేస్తే మంచిది. మంచి ఆరోగ్య అలవాట్లు ఇంటినుండే ప్రారంభం కావాలి. పెళ్లిళ్లలో , శుభకార్యాలలో ఆరోగ్యాన్ని హానికలిగించే అన్ని రకాల కూల్ డ్రింక్ నిలుపుదల చేయాలి. ప్రభుత్వం దీనిని నిషేధించే వరకు ప్రజలు పౌర సంఘాలు ఉద్యమించాలి. స్వలాభం కోసం ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీసే వాణిజ్య ప్రకటనలు ఇచ్చే హీరోలు, హీరోయిన్లు, క్రీడాకారులపై కేసులు బనాయించాలి.




## ప్రపంచ శాంతి కోసం నాయుడుపేటలో

# "రన్ ఫర్ జీసస్" శాంతి ర్యాలీ

**- గుడ్ ఫ్రైడే, ఈస్టర్ ప్రాముఖ్యతను చాటేందుకు క్రైస్తవ సంఘాల ఐక్యత కార్యక్రమం**

**- ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేసిన క్రైస్తవ మత పెద్దలు**

**- వందలాది మంది విశ్వాసులు పాల్గొని విజయవంతం చేసిన ర్యాలీ**

**- పట్టణ వీధుల్లో శాంతియుతంగా సాగిన భారీ ర్యాలీ**



**నాయుడుపేట - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో నెప్ ఫెలోషిప్ సేవకులు ఆధ్వర్యంలో "రన్ ఫర్ జీసస్" పేరుతో శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. నెప్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రైట్ రెవరెండ్ మైకేల్ బెన్హర్ నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయడం, మానవాళికి శాంతి సందేశాన్ని చేరవేయడం లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ యేసు ప్రభువు ప్రపంచ మానవాళికి రక్షణ కలిగించడానికి, ప్రేమ మరియు శాంతి సందేశాన్ని అందించడానికి భూమిపై అవతరించారని పేర్కొన్నారు. ఆయన మనుషుల పాప విమోచనార్థం శిలువ వేయబడి మూడవ రోజు తిరిగి లేచి సజీవుడిగా ఉన్నాడని విశ్వాసం క్రైస్తవ మతానికి ఆధారమని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల వల్ల అనేక అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ వంటి దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు శాంతియుతంగా పరిష్కారం కావాలని యేసు ప్రభువును ప్రార్థించినట్లు తెలిపారు. యుద్ధాల కారణంగా అనేక కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోతున్నాయని, బాధితుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ శాంతి ర్యాలీ నాయుడుపేట లోని ఏ ఎల్ సి ఎం స్కూల్ వద్ద ప్రారంభమై మార్కెట్, బాలాజీ మెడికల్, గర్ల్స్ హైస్కూల్, గాంధీ పార్క్, గడియారం, పోలీస్ స్టేషన్, దర్గా మీదుగా, అంబేద్కర్ విగ్రహం, ఎల్ఐసి కార్యాలయం, ఎన్టీఆర్ విగ్రహం మీదుగా బేరిపేట లూథరన్ చర్చ్ వరకు శాంతియుతంగా కొనసాగింది. నాయుడుపేట మండలంలోని క్రైస్తవ సంఘ సేవకులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో "నెప్ ఫెలోషిప్" కమిటీని ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెప్ ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ శరత్ బాబు, సెక్రటరీ ప్రేమ్ కుమార్, జాయింట్ సెక్రటరీ సురేష్ పాల్, ట్రెజరర్ మురళీధర్, ఐజాక్, శామ్యూల్, హానరబుల్ ప్రెసిడెంట్ వినయ్ కుమార్, సీనియర్ సలహాదారు యేసు పాదం, ప్రభుదాసు, సూరిబాబు, జాషువా, ఎలీషా తదితరులు పాల్గొన్నారు. శాంతి, ప్రేమ, ఐక్యత సందేశాలను ప్రజలకు చేరవేస్తూ నిర్వహించిన ఈ ర్యాలీలో వందలాది మంది విశ్వాసులు పాల్గొని కార్యక్రమాన్ని ఘనవిజయం చేశారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలతో కార్యక్రమం ముగిసింది.



## ఉత్కంఠ క్రికెట్ పోటీలో

# కోచింగ్ క్యాంపు బి జట్టు విజయం

**కదిరి - సూర్య వాస్తవం:**

ఉత్కంఠ క్రికెట్ పోటీలో కోచింగ్ క్యాంపు బి జట్టు విజయం సాధించినట్లు క్రికెట్ కోచ్ నజీర్ తెలిపారు. కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు ఏ జట్టు 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేశారు. మొహమ్మద్ 45 దేవేంద్ర 25 ప్రణయ్ 25 నాట్ అవుట్ రాణించారు. బౌలర్లు శివాజీ 2 తేజు, సన్నీ చెరో వికెట్ తీశారు. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన దీ జట్టు చివరి ఓవర్ చివరి బంతికి 4 పరుగులు అవసరం కాగ సాదిక్ ( 49 అఔ అవుట్ ) గెలిపించాడు. అఖిల్, తేజు చెరో 21 పరుగులతో సహకారం అందించారు. అజమల్ 3, బాలాజీ, యుక్తి చెరో రెండు వికెట్లు తీశారు. ఈ మ్యాచ్ కు ముఖ్య అతిధి గా 35 వ వార్డ్ టీడీపీ నాయకులు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ ఏసిపి చౌదరి విచ్చేసి టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల క్రికెట్ నెట్స్ రోడ్ నందు తన సొంత నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేసినందుకు చౌదరిని ప్లేయర్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సత్కరించి కృతజ్ఞతలు తెలియచేసారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )